# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :47 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: గురువారం 17-04-2025 | పేజీలు:4 వెల: 2.00


## ఉపాధి కూలీలకు రక్షణ..పని క్షేత్రాల్లో మంచినీటి సౌకర్యం

వరంగల్,జిల్లాలో వేసవిలో తగు జాగ్రత్తలతో ఉపాధిహామీ పనులను చేపడుతున్నారు. పనిప్రదేశాల్లో రక్షణచర్యలు చేస్తున్నారు. పూర్తి రక్షణ చర్యలతో పనులకు హాజరయ్యేలా డీఆర్‌డీవో అధికారులు ప్రణాళికలు తయారు చేశారు. మరోవైపు ఎండల ప్రభావం అధికంగా ఉండడంతో కూలీలు పనిచేసే ప్రాంతాల్లో వసతులు కల్పిస్తున్నారు. నీడతో పాటు మంచినీటి సదుపాయం కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. గుర్తించిన పనులను చేపడుతూ స్థానికులకు ఉపాధి కల్పిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా యాసంగి పంటలు ముగియడంతో నెల రోజులుగా గ్రామాల్లో ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఉపాధిహామీ పథకంలో భాగంగా నీటిగుంటలు, ఇంకుడు గుంతలు, మొక్కల పెంపకం, కందకాలు, చెక్‌డ్యాం కాలువల్లో పూడికతీత పనులు ఊటకుంటలు, టేకు నర్సరీలు, కిచెన్ షెడ్‌లు, గడ్డి పెంపకం, పశువుల నీటి తొట్టెలు, పండ్లతోటల పెంపకం, డంపిగ్‌యార్డులు, మరుగుదొడ్ల నిర్మాణం, నీటి నిల్వలకు సంబంధించిన పనులు, ప్రభుత్వ పాఠశాలలో వంటశాలల నిర్మాణాలను చేపడుతారు.

## జపాన్ చేరుకున్న రేవంత్ రెడ్డి..ఎయిర్ పోర్ట్ లో సాదరపూర్వక స్వాగతం ..



జపాన్ :నారిటా – జపాన్ – ఎనిమిది రోజుల పర్యటనలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి జపాన్ చేరుకున్నారు. నిన్న రాత్రి హైదరాబాద్ నుంచి బయలు దేరిన బృందం ఈ రోజు మధ్యాహ్నం నారిటా ఎయిర్‌పోర్ట్ దిగారు . విమానాశ్రయంలో ఆయనకు సాదరపూర్వక స్వాగతం పలికారు అక్కడి అధికారులు..కాగా ఆయన పర్యటన ఈ నెల 22 వరకు కొనసాగనుంది. ఈ పర్యటనలో భాగంగా టోక్యో, మౌంట్ ఫుజి, ఒసాకా, హిరోషిమాలో పర్యటించనున్నారు.ఆయనతో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఇతర అధికారులు కూడా ఉన్నారు..ఇక ఈ పర్యటనలో ఒసాకా వరల్డ్ ఎక్స్‌పో 2025లో పెవిలియన్‌ను ప్రారంభిస్తారు. ఈ ఎక్స్‌పోలో రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడం, సాంకేతిక సహకారాన్ని పెంపొందించడం ప్రధాన లక్ష్యం. ఈ పర్యటన ఫలితాలు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తున్నది. ఈ సందర్భంగా రేవంత్ బృందం వివిధ రంగాలకు చెందిన పారిశ్రామిక వేత్తలతో భేటి కానుంది.. వారికి తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలు ప్రభుత్వ పరంగా ఇస్తున్న పలు రాయితీలను వివరించనున్నారు..ఇక అధునాతన సాంకేతికత, ఆర్థిక స్థిరత్వం కలిగిన దేశం కావడంతో, అక్కడి కంపెనీలతో ఒప్పందాలు తెలంగాణలో ఉద్యోగ అవకాశాలను సృష్టించవచ్చు. గతంలో రేవంత్ అమెరికా, దక్షిణ కొరియా పర్యటనల్లో 31,500 కోట్ల రూపాయల పెట్టుబడులను సాధించారు. ఈ నేపథ్యంలో, జపాన్ పర్యటన కూడా ఇలాంటి విజయాన్ని అందిస్తుందని ఆశాభావం ఉంది. ముఖ్యంగా ఐటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో సహకారం పెరిగే అవకాశం ఉందిఒసాకా ఎక్స్‌పోలో తెలంగాణ పెవిలియన్ ఏర్పాటు రాష్ట్రాన్ని అంతర్జాతీయంగా ప్రమోట్ చేసేందుకు దోహదపడుతుంది. ఈ వేదిక ద్వారా రాష్ట్ర సంస్కృతి, సామర్థ్యాలను ప్రదర్శించడం ద్వారా టూరిజం, వాణిజ్య రంగాల్లో అవకాశాలు మెరుగుపడతాయి. అదే సమయంలో, జపాన్‌తో సాంకేతిక భాగస్వామ్యం తెలంగాణలో స్కిల్ యూనివర్సిటీ అభివృద్ధికి ఉపయోగపడుతుంది. జపాన్ నైపుణ్య శిక్షణ, ఆవిష్కరణలలో ముందుండటంతో, ఈ సహకారం రాష్ట్ర యువతకు నూతన దిశను అందించవచ్చు. అయితే, ఈ పర్యటన విజయం అమలు తీరుపై ఆధారపడి ఉంటుంది. ఒప్పందాలు కాగితాలకే పరిమితం కాకుండా, ఆచరణలోకి వస్తేనే నిజమైన ఫలితాలు కనిపిస్తాయి. గతంలో పలు ప్రభుత్వాలు పెట్టుబడులు తెచ్చినప్పటికీ, అమలులో జాప్యం వల్ల ప్రయోజనం పూర్తిగా దక్కలేదు. రేవంత్ ఈ అంశంలో పకడ్బందీ చర్యలు తీసుకుంటే, జపాన్ పర్యటన తెలంగాణ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుంది

## కంచ గచ్చిబౌలిలో అడవులు లేవని వాదిస్తే.. అక్కడే జైలు కట్టి అందులోనే వేస్తాం..

న్యూఢిల్లీ,కంచ గచ్చిబౌలి భూముల అంశంపై సుప్రీంకోర్టులో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. చెట్ల నరికివేతపై రేవంత్ సర్కార్‌పై సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. చెట్లు కొట్టేసే ముందు అనుమతులు తీసుకున్నారో లేదో స్పష్టంగా చెప్పాలని జస్టిస్ బీఆర్ గవాయి నిలదీశారు. సీఎస్‌ను కాపాడాలని అనుకుంటే.. వంద ఎకరాలను ఎలా పునరుద్ధిస్తారో చెప్పాలన్నారు. దీనిపై నాలుగు వారాల్లో ప్రణాళిక సిద్ధం చేయాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి విచారణను మే 15వ తేదీకి వాయిదా వేశారు. అప్పటి వరకు స్టేటస్ కోను విధించారు.కంచ గచ్చిబౌలి భూముల అంశంపై జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా చెట్లు కొట్టివేసే ముందు అనుమతులు తీసుకున్నారో లేదో స్పష్టంగా చెప్పాలని జస్టిస్ బీఆర్ గవాయి ప్రశ్నించారు. దీనికి ప్రభుత్వ తరఫున లాయర్ స్పందిస్తూ జామాయిల్ తరహా చెట్లు, పొదలను అనుమతి తీసుకునే తొలగించామని తెలిపారు. అందుకు చెట్ల నరికివేతపై సమర్థించుకోవద్దని జస్టిస్ బీఆర్ గవాయి ఆగ్రహం వ్యక్తం చేశారు. 1996లో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం అనుమతులు తీసుకున్నారో లేదో చెప్పాలన్నారు. వారంతపు సెలవుల్లో మూడు రోజుల్లో చెట్లు కొట్టాల్సిన తొందర ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. మీరు చెట్లు కొట్టడం వల్ల అక్కడ జంతువుల మీద కుక్కలు దాడి చేస్తున్నాయని.. ఆ వీడియోలను చూసి ఆందోళనకు గురయ్యామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అవసరమైతే 2400 ఎకరాల్లో ఒక్క చెట్టు కూడా కొట్టకుండా ఆదేశాలివ్వాల్సి వస్తుందని తెలిపారు.సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఊరుకోమని జస్టిస్ గవాయి హెచ్చరించారు. భూముల మార్టిగేజ్‌తో



తమకు సంబంధం లేదని.. చెట్ల నరికివేత గురించే తాము మాట్లాడుతున్నామని చెప్పారు. కంచ గచ్చిబౌలిలో అడవులు లేవని వాదిస్తే.. అదే ప్రాంతంలో జైలు కట్టి అందులోనే అధికారులను పెట్టాల్సి ఉంటుందని జస్టిస్ బీఆర్ గవాయి ఆగ్రహం వ్యక్తం చేశారు. చెట్లు కొట్టేసే ముందు అనుమతి ఉందా లేదా అన్నదే ముఖ్యమని తెలిపారు. అనుమతులు లేకుండా చెట్లు కొట్టేసినందుకు సీఎస్ సహా అధికారులు జైలుకు వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు. సీఎస్‌ను కాపాడాలనుకుంటే.. వంద ఎకరాలను ఎలా పునరుద్ధిస్తారో చెప్పాలన్నారు. పునరుద్ధరణ ఎలా చేస్తారు? ఎంతకాలంలో చేస్తారు? జంతు జాలాన్ని ఎలా సంరక్షిస్తారో స్పష్టంగా చెప్పాలని ఆదేశించారు. దీనిపై నాలుగు వారాల్లో ప్రణాళిక ఫైల్ చేయాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి విచారణను మే 15వ తేదీకి వాయిదా వేశారు. అప్పటివరకు స్టేటస్ కో విధించారు.

## సోనియా, రాహుల్‌పై బీజేపీ సంచలన ఆరోపణలు.. కాంగ్రెస్ కౌంటర్

ఢిల్లీ: దేశంలో మరోసారి రాజకీయం ఆసక్తికరంగా మారింది. నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలపై బీజేపీ నేతలు సంచలన ఆరోపణలు చేస్తున్నారు. నేషనల్ హెరాల్డ్ పత్రికను గాంధీ కుటుంబం తమ ప్రైవేట్ ఏటీఎంగా వాడుకున్నారని ఘాటు విమర్శలు చేశారు బీజేపీ సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్.నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ రంగంలోకి దిగింది. సోనియా, రాహుల్ గాంధీపై ఈడీ అభియోగపత్రం నమోదు చేసింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు దేశ వ్యాప్తంగా ఈడీ కార్యాలయాల ఎదుట నిరసనలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నిరసనలకు బీజేపీ కౌంటరిచ్చింది. తాజాగా బీజేపీ సీనియర్ నాయకులు రవిశంకర్ ప్రసాద్ స్పందిస్తూ..'కాంగ్రెస్ పార్టీకి నిరసన తెలిపే హక్కు ఉంది. కానీ.. ప్రభుత్వ ఆస్తులను దుర్వినియోగం చేసి నేషనల్ హెరాల్డ్‌కు ఇచ్చే హక్కు లేదు. స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న ప్రజల గొంతును బలోపేతం చేయడానికి ఏర్పాటుచేసిన ఈ వార్తా పత్రికను గాంధీ కుటుంబం తమ ప్రైవేట్ ఏటీఎంగా వాడుకున్నారు. ఈ కేసును కొట్టివేయించడానికి సోనియాగాంధీ, రాహుల్ ఎన్ని ప్రయత్నాలు చేసినా అవన్నీ విఫలమయ్యాయి.చట్టం తన పని తాను చేసుకుపోతుంది. అక్రమాలకు పాల్పడినవారు తప్పించుకోవడానికి ఇది కాంగ్రెస్ పాలన కాదు. ఇక్కడ రాజ్యాంగానికి ఎవరూ అతీతులు కాదు. దేశ రాజధానిలోని బహదూర్ షా జాఫర్ మార్గ్ నుంచి ముంబై, లక్నో, భోపాల్, పట్నా వరకు దేశవ్యాప్తంగా ఉన్న విలువైన ప్రజాఆస్తులను యంగ్ ఇండియా లిమిటెడ్ ద్వారా గాంధీ కుటుంబం చేతుల్లోకి బదిలీ చేయడానికి ఈ కార్పొరేట్ కుట్ర పన్నారు. 'అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్' (ఏజేఎల్)కు సంబంధించిన 99% షేర్లను కేవలం రూ.50 లక్షలకు బదలాయించుకొని, రూ.రెండు వేల కోట్ల విలువ చేసే ఆస్తుల్ని గాంధీ కుటుంబం తప్పుడు మార్గాన కైవసం చేసుకుంది' అంటూ




ఆరోపణలు చేశారు.మరోవైపు.. రవిశంకర్ ప్రసాద్ ఆరోపణలపై కాంగ్రెస్ ఘాటుగా స్పందించారు. ఈ క్రమంలో కాంగ్రెస్ నాయకులు పవన్ ఖేరా మాట్లాడుతూ..స్వాతంత్ర్యానికి ముందు బ్రిటిష్ వారు నేషనల్ హెరాల్డ్, గాంధీ కుటుంబం, కాంగ్రెస్‌ను ద్వేషించారు. ఇప్పుడు ఆ స్థానాన్ని ఆర్ఎస్ఎస్ ఆక్రమించింది. లాభాపేక్షలేని సంస్థపై మనీలాండరింగ్ కేసు, అక్కడ నిధుల మార్పిడి జరగలేదు. ఆస్తి హక్కులు బదిలీ చేయబడలేదు. ఇది నరేంద్ర మోదీ భయాన్ని చూపిస్తుంది. ఈ కేసు రాజకీయ ప్రేరేపితం మాత్రమే. మేము న్యాయ వ్యవస్థను విశ్వసిస్తాము. దీనిపై మేము చట్టబద్ధంగా పోరాడి న్యాయం పొందుతాము. ప్రతిపక్షాల గొంతును అణిచివేసేందుకు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను లక్ష్యంగా చేసుకున్నారు. మోదీ ప్రభుత్వానికి ఎటువంటి ఆధారాలు లేవు. వారు ప్రతిపక్షాల ప్రతిష్టను దిగజార్చాలని మాత్రమే కోరుకుంటున్నారు అని ఘాటు విమర్శలు చేశారు.

## రెండో రోజూ ఈడీ విచారణకు రాబర్ట్ వాద్రా..



న్యూఢిల్లీ, హర్యానా భూ ఒప్పందానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసు విచారణ నిమిత్తం కాంగ్రెస్ అగ్ర నాయకురాలు, వాయనాడ్ ఎంపీ ప్రియాంకాగాంధీ భర్త.. రాబర్ట్ వాద్రా బుధవారం మరోసారి ఈడీ కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన వెంట ప్రియాంక కూడా ఈడీ కార్యాలయం వరకు వెళ్లారు.కాగా ఈ మనీలాండరింగ్ కేసుకు సంబంధించి వాద్రా ఈడీ మంగళవారం నోటీసులు జారీ చేసి తమముందు హాజరుకావాలని ఆదేశించింది. నోటీసులు అందిన వెంటనే ఆయన నడుచుకుంటూ ఈడీ కార్యాలయానికి వెళ్లారు. దాదాపు ఐదు గంటలపాటు ఆయన వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. బుధవారం కూడా హాజరుకావాలని ఆదేశించడంతో ఇవాళ మళ్లీ వెళ్లారు. వాద్రా లోపలికి వెళ్తుండగా అప్పటిదాక ఆయనతోపాటు ఉన్న ప్రియాంక భర్తను ఆలింగనం చేసుకున్నారు.దీనికి సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చక్కెర్లు కొడుతున్నాయి. ప్రస్తుతం వాద్రాను అధికారులు విచారిసున్నారు. ప్రియాంకను ఈడీ కార్యాలయంలోని వెయిటింగ్ రూమ్‌లో కూర్చోబెట్టారు. విచారణకు హాజరయ్యే ముందు వాద్రా ఓ వార్తాసంస్థతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇది చాలా దురదృష్టకరమని అన్నారు. ప్రభుత్వ తప్పిదాలను బయటకు చెప్పేవారిపై ఈడీతో సహా ఇతర ఏజెన్సీలు దాడులు చేస్తున్నాయని ఆరోపించారు.ప్రభుత్వ తీరును దేశంలోని ప్రతిఒక్కరూ గమనిస్తున్నారని, ఈ ఏజెన్సీలపై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లుతోందని వాద్రా అన్నారు. అసలు సమస్యల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే ఇలా చేస్తున్నారని చెప్పారు. తనపై చేస్తున్న తప్పుడు ఆరోపణలకు వ్యతిరేకంగా తాను పోరాటం చేస్తున్నానని, ప్రజలు తనతోనే ఉన్నారని, వారు తనను రాజకీయాల్లో చూడాలనుకుంటున్నారని వాద్రా తెలిపారు.ఇదిలావుంటే ఈడీ ప్రకారం.. వాద్రా కంపెనీ 2008 ఫిబ్రవరిలో గుర్గావ్‌లోని షికోపూర్‌లో 3.5 ఎకరాల స్థలాన్ని ఓంకారేశ్వర్ ప్రాపర్టీ నుంచి కొనుగోలు చేసింది. దీని విలువ రూ. 7.5 కోట్లు. ఆ తర్వాత వాద్రా కంపెనీ ఆ భూమిని రియల్ ఎస్టేట్ కంపెనీ అయిన డీఎల్ఎ ఫ్‌కు రూ.58 కోట్లకు విక్రయించింది. డీఎల్ఎఫ్‌కు రూ.58 కోట్ల భారీ లాభంతో విక్రయించడంతో మనీలాండరింగ్ ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఈడీ విచారిస్తోంది.

## ఫిలింనగర్‌లో బీజేపీ నేత అక్రమ నిర్మాణాలు



హైదరాబాద్,జీహెచ్‌సీ నుంచి ఎలాంటి అనుమతులు లేవు.. పేదలకు కేటాయించిన వాంబే గృహాలను కొనుగోలు చేసేందుకు వీలులేక అడ్డదారిలో ఉంది. కొనుగోలు. ఎలాంటి నిబంధనలు పాటించకుండా ఏకంగా ఆరంతస్థుల్లో భవన నిర్మాణం.. అక్రమ నిర్మాణాన్ని కూల్చే యాలని హైకోర్టులో ఆదేశాలు. జీహెచ్‌సి అధికా రులు, అధికారులు మీనమేషాలు లెక్కిస్తుండడం పలు అనుమానాలు రేకెత్తిస్తోంది. ఏకంగా రాష్ట్ర శాసనసభలో సైతం ఈ స్థానిక ఎమ్మెల్యే లేవనెత్తినా ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడం అధికా రుల అలసత్వానికి నిదర్శనంగా నిలుస్తోంది .వివరాల్లోకి వెళ్తే..

షేక్‌పేట మండలం ఫిలింనగర్‌లోని గౌతమ్‌నగర్‌లో బంజారాహిల్స్ డివిజన్‌కు చెందిన బీజేపీ నేత.వెంకటరెడ్డి గత దాదాపు 180 గజాల్లో 6 అంతస్తుల భవనాలు ఉన్నాయి. ఈ స్థలంలో గతంలో పేదల కోసం (బీపీఎల్) వాంబే ఇండ్లు ఉండేవి. ఎస్సీ, ప్రభుత్వ బీసీలకు చెందిన పేదలకు గతాల హాయంలో ఇచ్చిన ఇళ్లను బీజేపీ నేత వెంకట్‌రెడ్డి అక్రమంగా కొనుగోలు చేయడంతో పాటు ఈ స్థలంలో సుమారు 60 గజాలను జీవో 59 కింద తన భార్య నర్మద పేరుతో క్రమబద్ధీకరణ చేయించుకున్నారు. నిబంధనల ప్రకారం వాంబే గృహాలను లబ్దిదారుల కుటుంబాలు మాత్రమే ఉపయోగించుకోవాలి తప్ప వేరేవారికి అమ్మరాదని స్పష్టమైన నిబంధనలు ఉన్నాయి. అయినా తప్పుడు సమాచారం ఇచ్చి 60 గజాలను జీవో 59 కింద క్రమబద్ధీకరణ చేయించుకున్న వెంకట్‌రెడ్డి మిగిలిన కనెక్ట్‌కుని ఇటీవల బహుళ అంతస్తుల భవనాన్ని సాధించాడు.దీంతో బస్తీవాసులు జీహెచ్‌టీకి, షేక్‌పేట మండల తహసీల్దార్‌కు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టారు జీహెచ్‌పీ టౌన్‌ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకున్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారులకు ముడుపులు చెల్లించి అక్రమ నిర్మాణాలను ఉపేక్షిస్తున్నారంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో పాటు ఇటీవల స్థానికంగా నివాసం ఉంటున్న కొందరు వ్యక్తులు హైకోర్టును ఆశ్రయించగా అక్రమదారులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. జీహెచ్‌క్ యాక్ట్ ప్రకారం కూల్చివేయాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టుతో సహా చేశారు. అయితే నిర్మాణదారుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో 15 రోజుల్లో కూల్చివేతలు చేపడతామని స్పీకింగ్ ఆర్డర్స్ జారీ చేశారు. అయితే అధికారులను తుంగలో తొక్కిన నిర్మాణదారులు పనులు కొనసాగుతున్నాయి. ఆదేశాలు జారీ చేసి రెండునెలలు గడిచాయి ఇప్పటిదాకా ఎలాంటి చర్యలు తీసుకోలేదు అధికారుల వ్యవహారశైలిపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు వ్యక్తం చేస్తున్నారు. పేదవాడు చిన్నతప్పు జేసీబీలతో విరుచుకుపడే జీహెచ్‌సీ, అధికారులు రాజకీయనాయకులు చేస్తున్న అక్రమాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు. తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై జీహెచ్‌సీ టౌన్‌ప్లానింగ్ అధికారులు, అధికారుల తీరుపై ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ కూడా ప్రస్తావించడం. ఇదిలా ఉండగా మొత్తం స్థలంలో 60గజాల జీవో 59 కింద క్రమబ ద్దీకరణ చేయించుకున్న వెంకట్‌రెడ్డి మరో 120 గజాల ప్రదర్శన లబ్దిదారుల నుంచి అక్రమంగా తీసుకున్నట్లు అధికారుల విచారణలో తేలింది. ఇప్పటికే షేక్‌పేట మండల సిబ్బంది ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేసి నివేదికను పంపించారు. సదరు స్థలంలోని బిల్‌ను సీజ్ చేయాల్సిన అధికారులు కాలయాపన చేస్తుండడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఫిలింనగర్‌తో పాటు బంజారాహిల్స్ రోడ్ నెం 12లోని ఎన్‌బీటీనగర్‌లో సైతం వెంకటరెడ్డి ఇదే విధంగా ఎస్సీలకు చెందిన స్థలాలు అడ్డదారిలో క్రమబద్ధీకరణ చేయించుకున్నారని, కోర్టుల్లో

## సుప్రీంకోర్టు ఆదేశాలను స్వాగతించిన బిఆర్ఎస్ పార్టీ

హైదరాబాద్, సుప్రీంకోర్టు ఆదేశాలను భారత రాష్ట్ర సమితి హృదయపూర్వకంగా స్వాగతం తెలిపింది. కంచ గచ్చిబౌలిలో ధ్వంసం చేసిన అడవులను పునరుద్ధరించాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను స్వాగతిస్తున్నట్లు పేర్కొనింది.రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు రాష్ట్ర చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్‌కు వన్యప్రాణులను కాపాడాలంటూ ఆదేశాలు ఇవ్వడం గొప్ప విజయమని పేర్కొంది. వన్యప్రాణుల పట్ల, పర్యావరణ పరిరక్షణకు పాటుపడే ప్రతి ఒక్కరికి దక్కిన విజయం అంటూ పేర్కొన్నారు. గొంతులేని మూగజీవాల కోసం, చెట్ల కోసం, పర్యావరణం కోసం అండగా నిలబడిన హైదరాబాద్ సెంట్రల్ యూని వర్సిటీ విద్యార్థులకు ధన్యవాదాలు తెలిపారు.

సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన కేంద్ర సాధికారిక కమిటీ ఇచ్చిన సిఫార్సులను కూడా భారత రాష్ట్ర సమితి స్వాగతి స్తున్నదని పేర్కొన్నారు. కంచ గచ్చిబౌలిని ప్రైవేట్ పార్టీకి తాకట్టు పెట్టిన రేవంత్ రెడ్డి ప్రభుత్వ వ్యవ హారంలో ఆర్థిక అవకతవకలు జరిగే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తం చేసిన కేంద్ర సాధికారిక కమిటీ మా పార్టీ వాదనను బలపరుస్తున్నదని తెలిపారు. కంచ గచ్చిబౌలి భూముల తాకట్టు విషయంలో పదివేల కోట్ల రూపాయల అవినీతికి రేవంత్ రెడ్డి పాల్పడ్డారని చేసిన ఆరోపణలను పునరుద్ఘా టించారు కేటీఆర్.



అడవుల పట్ల, వన్యప్రాణుల పట్ల రేవంత్ రెడ్డి నెంబర్ వన్ విలన్‌గా మారాడని విమర్శించారు ఆయన. పర్యావరణ విధ్వంసానికి పర్యావరణ హత్యకు పాల్పడి తప్పించుకోలేరనే కనీస సోయి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇకనైనా వస్తుందని ఆశాభావం వ్యక్తం చేసారు కేటీఆర్. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి తనను తాను మోసం చేసుకున్న విషయాన్ని అర్థం చేసుకుని పర్యావరణ విధ్వంసం ఆపాలని కోరారు.

## బీజేపీతో పొత్తుపై అన్నాడీఎంకే నేతల్లో అసంతృప్తి..



చెన్నై:తమిళనాడులో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. దీంతో బీజేపీ–అన్నాడీఎంకే మధ్య పొత్తు కుదిరింది. అయితే ఈ పొత్తుపై అన్నాడీఎంకేలో అసంతృప్తి జ్వాలలు చెలరేగాయి.తిరుప్పూర్‌లో మాజీ మంత్రి జయరామన్ నేతృత్వంలో సమావేశం అయ్యారు. ఈ భేటీకి పలువురు అన్నాడీఎంకే సీనియర్ నేతలు హాజరయ్యారు. వక్ఫ్ చట్టం ద్వారా ముస్లింలకు అన్యాయం జరగకుండా చూడాలని నేతలు డిమాండ్ చేశారు. ఇక అన్నాడీఎంకే నేతల వ్యాఖ్యలపై బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముస్లింలకు అన్యాయం జరగదని.. వారికి మేలే జరుగుతుందని బీజేపీ నేతలు అంటున్నారు.ఇటీవల కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెన్నైలో పర్యటించారు. ఈ సందర్భంగా అన్నాడీఎంకేతో బీజేపీ పొత్తు కుదిరింది. అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. అధికార డీఎంకేను గద్దె నుంచి దింపడమే లక్ష్యమని ప్రకటించారు.ఇదిలా ఉంటే తాజాగా అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె. పళనిస్వామి మీడియాతో మాట్లాడారు. ఓట్లు చీలకుండా.. డీఎంకేను ఓడించడమే లక్ష్యమని తెలిపారు.

## సంపాదకీయం

గురువారం 17-04-2025

# చిరు వ్యాపారాలకు చేదోడు

దేశంలో ఎక్కడికి వెళ్లినా చిన్నచిన్న వ్యాపారాలు, సంస్థలు ఎన్నో కనిపిస్తాయి. వీటిపై ఆధారపడి కోట్ల మంది జీవనం సాగిస్తున్నారు. ఇలాంటి వారితో పాటు కొత్తగా వ్యాపార రంగంలోకి రావాలనుకునే వారికి, ముఖ్యంగా ఔత్సాహిక మహిళలకు బ్యాంకు రుణాలు సరిగ్గా అందడంలేదు. ఈ లోటును తీర్చేందుకు కేంద్ర ప్రభుత్వం 'ప్రధానమంత్రి ముద్రా యోజన'ను తీసుకొచ్చింది.దేశంలో ఎక్కడికి వెళ్లినా చిన్నచిన్న వ్యాపారాలు, సంస్థలు ఎన్నో కనిపిస్తాయి. వీటిపై ఆధారపడి కోట్ల మంది జీవనం సాగిస్తున్నారు. ఇలాంటి వారితో పాటు కొత్తగా వ్యాపార రంగంలోకి రావాలనుకునే వారికి, ముఖ్యంగా ఔత్సాహిక మహిళలకు బ్యాంకు రుణాలు సరిగ్గా అందడంలేదు. ఈ లోటును తీర్చేందుకు కేంద్ర ప్రభుత్వం 'ప్రధానమంత్రి ముద్రా యోజన'ను తీసుకొచ్చింది. ఇటీవలే పదేళ్లు పూర్తిచేసుకున్న ఈ పథకం ద్వారా ఎలాంటి ఫలితాలు వచ్చాయి?మన దేశంలో దాదాపు 5.77 కోట్ల చిన్న వ్యాపారాలు ఉన్నాయని జాతీయ నమూనా సర్వే కార్యాలయం లోగడ విశ్లేషించింది. అవన్నీ ఉత్పత్తి, వర్తకంతో పాటు సేవలు అందించడంలో నిమగ్నమైనవే. వాటి నిర్వాహకులకు బ్యాంకు రుణాలు, ప్రభుత్వ ఆర్థిక సాయం సరిగ్గా అందడంలేదు. చాలామందికి అసలు వీటి గురించి అవగాహనే ఉండటం లేదు. మరోవైపు ఆసక్తి ఉన్నా, చేతిలో డబ్బుల్లేక ఎంతోమంది ఔత్సాహికులు వ్యాపారం చేయడానికి వెనకడుతున్నారు. ఇలాంటి వారితో పాటు సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలకు కావాల్సిన రుణాలను అందించడానికి ప్రధానమంత్రి ముద్రా యోజన(పీఎంఎంవై)ను అమలులోకి తీసుకొచ్చారు. 2015, ఏప్రిల్ 8న ఆరంభించిన ఈ పథకం ద్వారా మహిళా సాధికారతను సుసాధ్యం చేయవచ్చని తలపోశారు. స్థూల దేశీయోత్పత్తిలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల వాటా సుమారు 30శాతం. నిరుడు భారతదేశ ఎగుమతుల్లో ఇవి దాదాపు 46శాతాన్ని ఆక్రమించాయి. ఈ సంస్థలకు సకాలంలో సరైన ఆర్థిక తోడ్పాటు అందిస్తే... మరింతగా రాణించడమే కాకుండా, కాలక్రమంలో పెద్ద సంస్థలుగా అవతరిస్తాయి.

సమ్మిళిత వృద్ధికి తోడ్పాటు

చిరు వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు, ఔత్సాహికులను ప్రోత్సహించడానికి ముద్రా యోజన ద్వారా పది లక్షల రూపాయల వరకు ఆర్థిక సాయం అందించాలని మొదట్లో నిర్ణయించారు. ఇందుకోసం ఆయా సంస్థలను శిశు(రుణ పరిమితి-రూ.50వేల వరకు), కిశోర్(రూ.50వేల నుంచి 5లక్షలు), తరుణ్(రూ.5లక్షల నుంచి 10లక్షలు) విభాగాలుగా వర్గీకరించారు. ఆ విజయవంతం కావడంతో కేంద్రం 2024-25 బడ్జెట్లో నాలుగో కేటగిరీగా తరుణ్ ప్లస్‌ను తీసుకొచ్చింది. దీని పరిధిలోకి వచ్చే వ్యాపార సంస్థలకు రూ.10లక్షల నుంచి 20లక్షల వరకు రుణాలు అందిస్తారు. ఎటువంటి క్రెడిట్ చరిత్ర, తనఖా పెట్టడానికి ఆస్తిపాస్తులు లేని ఔత్సాహికుల కోసం ఈ పథకం కింద 'రుణహామీ నిధి'ని ఏర్పాటుచేశారు. దాంతో బ్యాంకులు, బ్యాంకింగేతర సూక్ష్మ ఆర్థిక సంస్థలు లబ్ధిదారులకు సులభంగా రుణాలివ్వడానికి విధానపరమైన అడ్డంకులు తొలగిపోయాయి. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, వెనకబడిన వర్గాల వారిని లబ్ధిదారులుగా గుర్తించి సాయం అందిస్తున్నారు. గతంలో వీరికి బ్యాంకు రుణాలు గగనమయ్యేవి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం, దాదాపు సగం 'ముద్రా' ఖాతాలు అట్టడుగువర్గాలకు చెందిన వారివే. లబ్ధిదారుల్లో మహిళలు 68శాతం, మైనార్టీలు 11శాతం ఉన్నారు. ఈ విధంగా దేశంలో సమ్మిళిత వృద్ధికి ముద్రా యోజన ఎంతగానో తోడ్పడుతోంది. ఆర్‌బీఐ ద్రవ్యవిధాన కమిటీ ఇటీవలే రుణాలపై వడ్డీ రేటును 0.25శాతం తగ్గించింది. ఆ మేరకు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలకు ఆర్థిక భారం తగ్గనుంది.ముద్రా యోజన కింద ఇంతవరకు మొత్తం 52 కోట్ల రుణాలకుగానూ రూ.32.61లక్షల కోట్లు మంజూరు చేశారు. 2016లో సగటు రుణం రూ.38వేలు. ఇప్పుడది రూ.లక్షకు పెరిగింది. ఎక్కువశాతం మహిళలు తమ అప్పులను సకాలంలో తిరిగి చెల్లిస్తుండటం చెప్పుకోదగ్గ విషయం. ఇప్పటివరకు అత్యధిక ముద్రా రుణాలను పొందిన ఆరు రాష్ట్రాల్లో తమిళనాడు, ఉత్తర్‌ప్రదేశ్, కర్ణాటక, పశ్చిమ్ బెంగాల్, బిహార్, మహారాష్ట్ర ఉన్నాయి. జమ్మూకశ్మీర్ సైతం పెద్దసంఖ్యలో రుణాలు అందుకుంటోంది. ఈ విషయంలో తెలుగు రాష్ట్రాలు వెనకపడ్డాయి.

అధిగమించాల్సిన సవాళ్లు

ముద్రా రుణాలను అందించే బ్యాంకులూ ఆర్థిక సంస్థలు సిబ్బంది లేమితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. దీనివల్ల లబ్ధిదారులకు ప్రయోజనం చేకూర్చడం జాప్యమవుతోంది. రుణ ప్రక్రియపై లబ్ధిదారులకు సరైన అవగాహన ఉండటంలేదు. ముఖ్యంగా అవసరమైన పత్రాలను సకాలంలో సమకూర్చలేకపోతున్నారు. డాక్యుమెంటేషన్ సరిగ్గా లేకపోవడంతో చాలా దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయి. విధివిధానాలను, డాక్యుమెంటేషన్ ప్రక్రియను సులభతరం చేస్తే మరింత మందికి ఆర్థిక చేయూత దక్కుతుంది. ముద్రా రుణాలు ఎక్కువగా మహిళల పేరున మంజూరవుతున్నా, ఇంట్లోని మగవారి అజమాయిషీయే ఎక్కువగా ఉంటోంది. కాబట్టి మహిళా లబ్ధిదారుల్లో ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించి, వారికి నాయకత్వ శిక్షణ ఇప్పించడం అవసరం. ముఖ్యంగా తీసుకున్న రుణాలను సక్రమంగా వినియోగించి, వ్యాపారాన్ని విస్తరించుకోవడంపై అవగాహన పెంచాలి. ప్రభుత్వం రుణాలివ్వడంతోనే సరిపెట్టకుండా... వ్యాపార సంస్థలకు అవసరమైన సాంకేతికతను, మార్కెట్ వసతులను సమకూర్చాలి. నిపుణుల ద్వారా వ్యాపార నిర్వహణ మెలకువలను నేర్పించాలి. ఇందుకోసం సాంకేతిక సంస్థలు, విశ్వవిద్యాలయాల అధ్యాపకులు, సాంకేతిక నిపుణుల సేవలను ఉపయోగించుకోవాలి.

నిరర్థక ఆస్తులు ఎన్ని?

ముద్రా రుణాల్లో 2020-21 నాటికి 4.7శాతం నిరర్థక ఆస్తులుగా మారగా, 2023-24 నాటికి అవి 3.4శాతానికి పడిపోయాయి. ఈ రుణాలను ఏడు సంవత్సరాల్లో తిరిగి చెల్లించే వీలుంది. కాబట్టి, వీటిలో చాలామటుకు మొండి బాకీలుగా మారడం లేదు. ప్రస్తుతం అమెరికా ప్రతీకార సుంకాల ప్రభావం అన్ని దేశాల మీదా పడుతోంది. అందుకని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలు రెట్టించిన ఉత్సాహంతో పనిచేయాల్సి ఉంటుంది. ఈ సమస్యను అధిగమిం చడానికి ప్రభుత్వ తోడ్పాటు మరింతగా అవసరం. ముద్రా రుణాలను వ్యాపారు లూ పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకుంటే, వారితోపాటు దేశం కూడా గణనీయమైన వృద్ధి సాధించగలుగుతుంది. ఇంకెంతో మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందివస్తాయి. ప్రతికూలతల్లోనూ అవకాశాలను ఒడిసి పట్టుకో గల మన మహిళలు పారిశ్రామిక రంగంపైనా చెరగని 'ముద్ర' వేస్తారని ఆశిద్దాం!

# సజ్జల ఈజ్ బ్యాక్.. జగన్ ప్లాన్ ఇదేనా?



అమరావతి, వైసీపీ ఓడిపోయిన తర్వాత సజ్జల రామకృష్ణారెడ్డిని దూరం పెట్టినట్టు కనిపించిన జగన్ మళ్లీ ఆయనను అందలమెక్కిస్తున్నారు. ఇక నుంచి పార్టీకి దిశానిర్దేశం చేసే బాధ్యత సజ్జల భుజాలపై పెట్టారు మాజీ సీఎం. జగన్ తాజాగా నియమించిన పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ కన్వీనర్‌గా సజ్జలను నియమించడంతో పార్టీలో ఆయన ప్రాధాన్యతను మరింత పెరిగినట్లైంది. పార్టీలో మళ్లీ సజ్జల పెత్తనమే కొనసాగనుండటంతో కొందరు సీనియర్ నేతలు పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నారంట .. మరోవైపు సదరు కమిటీలో ముద్రగడ పద్మనాభంకు స్థానం కల్పించడం, దానికి ఆయన సంబరపడిపోతూ ప్రకటనలు చేస్తుండటం చర్చనీయాంశంగా మారింది.

33 సభ్యులతో వైసీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ

వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీని నియమించారు. మొత్తం 33 సభ్యులతో వైసీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి కన్వీనర్‌గా ఈ పీఏసీని ప్రకటించారు. ఎంపీలు అవినాశ్ రెడ్డి, అయోధ్య రామిరెడ్డి, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీమంత్రులు రోజా, విడదల రజని, కొడాలి నాని, వెల్లంపల్లి శ్రీనివాస్, బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, అంజాద్ బాషా, ఆదిమూలపు సురేశ్, నారాయణస్వామి, అనిల్ కుమార్ యాదవ్‌తో పాటు ముద్రగడ పద్మనాభం, సాకే శైలజానాథ్, నందిగం సురేశ్ తదితరులకు ఈ కమిటీలో స్థానం కల్పించారు. ఈ రాజకీయ సలహాల కమిటీకి ఇప్పటికే పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా ఉన్న సజ్జల రామకృష్ణారెడ్డి కన్వీనర్ గా నియమించారు. దాదాపు వైసీపీలో కీలక నేతలందరికీ ఈ కమిటీలో స్థానం లభించినట్లైంది.

పార్టీ వ్యవహారాలన్నీ తానే చూసుకున్న సజ్జల

వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు సజ్జల రామకృష్ణా రెడ్డి ఆ పార్టీ ప్రధాన కార్యదర్శిగా, ప్రభుత్వ సలహాదారుగా అన్నీ తానై జగన్ ప్రభుత్వాన్ని నడిపించారు. ఆయన ఇచ్చిన స్క్రిప్ట్ పట్టుకొని చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, నారా లోకేష్‌లపై వైసీపీ నేతలు చెలరేగిపోయేవారు. ఆయన కుమారుడు సజ్జల భార్గవ రెడ్డి వైసీపీ సోషల్ మీడియాలో తన ప్రెస్‌మీట్‌లను వైరల్ చేసేవారని పోసాని కృష్ణమురళి స్వయంగా పోలీసు విచారణలో వెల్లడించారు. అంటే ప్రత్యర్థులపై దాడుల నుంచి పార్టీ వ్యవహారాలన్నీ ఎలా డీల్ చేయాలనే విషయం వరకు అన్నీ సజ్జల రామకృష్ణా రెడ్డే స్వయంగా చూసుకునేవారన్నమాట. వైసీపీని వీడిన కోటంరెడ్డి, విజయసాయిరెడ్డి నుండి మొన్న పోసాని వరకూ అందరూ ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. సజ్జల రామకృష్ణా రెడ్డి వంటివారు శల్య సారథ్య చేస్తూ జగన్ ముంచేస్తున్నారని వైసీపీ శ్రేణులు అభిప్రాయపడుతుంటాయి.

జగన్ కోటరీగా టార్గెట్ అయిన సజ్జల రామకృష్ణారెడ్డి

గత ఎన్నికల్లో టికెట్ల పంపిణీ సమయంలో కూడా పలువురు నేతలు జగన్ కోటరీ అంటూ సజ్జలను టార్గెట్ చేశారు. అయితే వైసీపీ ఘోర పరాజయం పాలైన తర్వాత కూడా జగన్ మేల్కోలేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఓటమి తర్వాత జగన్ సజ్జలని పక్కన పెట్టినట్లు కనిపించారు. అయితే విజయసాయిరెడ్డివంటి ముఖ్యనేత పార్టీని వీడి వెళ్ళిపోవడం సజ్జలకు బాగా కలిసి వచ్చిందంటున్నారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఒక్కొక్కరికీ రూ. లక్షల చొప్పున ప్రభుత్వ సొమ్ము జీతభత్యాలుగా చెల్లిస్తూ 50 మందికిపైగా సలహాదారులని నియమించుకున్నారు. ఇప్పుడంత సీన్ లేకపోవడంతో 33 మంది సీనియర్ నేతలతో ఓ రాజకీయ సలహా కమిటీని ఏర్పాటు చేసుకున్నారంట. దానికి సజ్జల రామకృష్ణా రెడ్డిని సమన్వయకర్తగా నియమించారు. అంటే పార్టీలో ఇప్పటికే స్టేట్ కోఆర్డినేటర్‌గా ఉన్న సజ్జల పెత్తనం మొదలైనట్లే అంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తమకు రాజకీయ భవిష్యత్తు ఉండదని మెజారిటీ నేతలు భావిస్తున్నారట.

సజ్జల శాఖల మంత్రి పాత్ర పోషించిన సజ్జల

ఇదివరకు వైనాట్ 175 నినాదం.. 50 మందికి పైగా పెయిడ్ సలహాదారులు .. వందలకోట్లు ఖర్చు పెట్టి ఐప్యాక్ టీమ్.. చుట్టూ కోటరీ .. ఇలాంటి సలహాలన్నీ సజ్జలే ఇచ్చారని.. జగన్ ఏం చేసినా కరెక్టే అని భజన చేశారని సజ్జలపై సొంత పార్టీలోనే విమర్శలున్నాయి.. పైగా సకల శాఖల మంత్రి పాత్ర పోషిస్తూ సజ్జలే చాలా సందర్భాల్లో సీఎంలా వ్యవహరించరన్నటాక్ ఉంది.. విజయసాయిరెడ్డి కూడా పదేపదే కోటరీ అని విమర్శలు చేయడానికి అదే కారణమంటారు.

ఓడిపోయిన తర్వాత సజ్జలను, కోటరీని పక్కన పెట్టినట్లు కనిపించిన జగన్ మళ్లీ ఆయనకు ప్రధాన బాధ్యతలు అప్పగించడం వైసీపీ సీనియర్లకు మింగుడుపడటం లేదంట.

సజ్జలకు మళ్లీ బాధ్యతలు కట్టబెట్టడంపై సీనియర్లలో అసంతృప్తి

జగన్ తాజా నిర్ణయంతో పార్టీ ఎమ్మెల్యేలు, సీనియర్ నేతల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోందంట. జగన్ లో మార్పు వచ్చింది కోటరీని దూరం పెడుతున్నారని భావించే లోపే ‰ా% మళ్లీ పాత బ్యాచ్ అందరికీ పగ్గాలు అప్పగిస్తుండడంతో నిలకడలేని నిర్ణయాలు తీసుకుంటున్న జగన్ పార్టీలో ఉండడం కంటే ఆపార్టీని వీడడమే మేలని మెజార్టీ నేతలు భావిస్తున్నారంట. పొలిటికల్ అడ్వైజరీ కమిటీకి మరో అంశం కూడా చర్చనీయాంశంగా మారిందిప్పుడు. ఆ 33 మంది కమిటీలో ముద్రగడ పద్మనాభానికి కూడా చోటు దక్కింది. ఇంతకీ ఈ వైసీపీ రాజకీయ వ్యవహారాల కమిటీ పనేమిటి? అంటే.. రాష్ట్ర రాజకీయపరిస్థితులపై చర్చించి.. జగన్ కు అవసరమైన సలహాలు ఇవ్వడం.

జగన్ కు కృతజ్ఞతలు చెబుతూ ప్రెస్ నోట్

ఆ 33 మంది సభ్యుల కమిటీలో తనను ఒకరిగా చేర్చినందుకు ముద్రగడ తన జన్మధన్యమై పోయినట్లు ఆనందపడిపోతున్నారు. వాస్తవానికి వైసీపీలో నిర్ణయాలన్నీ జగనే తీసుకుంటారని, కోటరీ చెప్పే సలహాలు కూడా నచ్చితేనే స్వీకరిస్తారన్న సంగతి పెద్ద రహస్యమేమీ కాదు. అందుకే ఇప్పుడు ప్రకటించిన పీఏసీ పాత్ర నామ్ కే వాస్తే అన్న విషయం ఆ పార్టీ వర్గాలే చెబుతున్నాయి. అటువంటి నామ్ కే వాస్తే కమిటీలో ఓ సభ్యుడిగా తనను చేర్చినందుకే బ్రహ్మానందపడిపోతున్నారు ముద్రగడ. తనకు పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీలో స్థానం కల్పించినందుకు జగన్ కు కృతజ్ఞతలు చెబుతూ ప్రెస్ నోట్ కూడా విడుదల చేశారు.

జగన్ మళ్లీ సీఎం అవుతారని ముద్రగడ ఆశాభావం

జగన్ మరోసారి ముఖ్యమంత్రి పదవి చేపడతారని, జగన్ సీఎం కావడానికి తన శక్తి మేరకు తాను పోరాడతాననీ, పదికాలాల పాటు జగనే రాష్ట్రాన్ని పాలించాలని ముద్రగడ తన లేఖలో పేర్కొన్నారు. గత ఏడాది జరిగిన ఎన్నికలలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో వైసీపీ ఒక్కటంటే ఒక్క సీటు కూడా గెలవలేదు. ఇక ముద్రగడ పిఠాపురంలో పవన్ కళ్యాణ్ ను ఓడించడమే తన లక్ష్యమన్నట్లు ముద్రగడ హడావుడి చేశారు. అయితే 70 వేల ఓట్ల పైచిలుకు మెజారిటీతో పవన్ కళ్యాణ్ పిఠాపురం నుంచి విజయం సాధించారు. అంటే పిఠాపురంలో నిర్ణయాత్మకంగా ఉన్న కాపు సామాజిక వర్గం ముద్రగడను నమ్మడం లేదనడానికి ఇదే నిదర్శనమని అంటున్నారు.

పిఠాపురంలో పవన్ ను ఓడిస్తానని ముద్రగడ ప్రగల్భాలు

గత ఎన్నికల్లో ముద్రగడ సొంత నియోజకవర్గం జగ్గంపేటలో తెలుగుదేశం అభ్యర్థి జ్యోతుల నెహ్రూ 52 వేల పైచిలుకు ఆధిక్యతతో భారీ విజయం సాధించారు. 1999 తర్వాత ముద్రగడ ఒక్కటంటే ఒక్క ఎన్నికలో కూడా విజయం సాధించలేదు. ముద్రగడ చివరి సారిగా 2014 ఎన్నికలలో ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్ గా పోటీ చేసి కనీసం డిపాజిట్ కూడా రాకుండా పరాజయం పాలయ్యారు. ఇప్పుడు జగన్ ను ముఖ్యమంత్రిని చేయడానికి పోరాడుతానంటూ గంభీరమైన ప్రకటనలు చేస్తూ.. తన ప్రతిష్టను తానే మరింత దిగజార్చుకుంటూ నవ్వుల పాలవుతున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# ఎమ్మెల్యే ఇచ్చిన ధమ్కికి మాజీ ఎమ్మెల్యే ఒక్కసారిగా సైలెంట్ అయ్యారా?




పెద్దపల్లి :ఎమ్మెల్యే ఇచ్చిన ధమ్కికి మాజీ ఎమ్మెల్యే ఒక్కసారిగా సైలెంట్ అయ్యారా? ప్రతి ప్రక్ష నాయకుడిగా సమర్థవంతమైన పాత్ర పోషించడంలేదా? మౌనం రాజకీయ వ్యూహంలో భాగమా.. లేక భయమా? పెద్దపల్లి జిల్లా రాజకీయాల్లో జోరుగా వినిపిస్తున్న చర్చ ఇది.. ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత.. భూముల భాగోతం బయట పెడతానంటూ చేసిన శపథం ఏమైందంటూ రాజకీయ వర్గాలు ప్రశ్నిస్తున్నాయంట. ఇంతకీ వారిద్దరి మధ్య రాజీ కుదిరిందా? మాజీ ఎమ్మెల్యే మౌనం వెనుక అసలు కారణం ఏంటి? వాచ్ దిస్ స్టోరీ.పెద్దపల్లి జిల్లా అంటే గుర్తొచ్చేది ఇద్దరు నేతలు. ఒకరు గతంలో పదేళ్లపాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న దాసరి మనోహర్ రెడ్డికాగా‰ా% మరొకరు ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్యే విజయ రమణారావు.. గతంలో ఇద్దరూ ఇద్దరే అన్నట్లుగా వ్యవహరించేవారు. నువ్వెంత అంటే నువ్వెంత అంటూ ఇద్దరి మధ్య మాటల యుద్ధం నడిచేది.నీ అవినీతి బాగోతం బయటకు తీస్తా అంటేనీ అవినీతి అవినీతి బాగోతం కూడా బయటకు తీస్తానంటూ ఇద్దరు నిత్యం ఉప్పు-నిప్పులా ఉండేవారు. వీరిద్దరి మధ్య ఆరోపణలు, సవాళ్లు, ప్రతిసవాళ్లతో జిల్లా రాజకీయాలు హీటెక్కేవి. ఇదంతా 2023కు ముందు ఇద్దరి మధ్య జరిగిన పొలిటికల్ వార్. సీన్ కట్ చేస్తే.. 2023లో గులాబీ పార్టీ దారుణంగా ఓడిపోయింది.పదేళ్లపాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా జిల్లాను ఏకచక్రాధిపత్యంగా ఏలిన దాసరి మనోహర్ రెడ్డి ఓడిపోయారు. కాంగ్రెస్ నేత చింతపల్లి విజయ రమణారావు కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించారు. కాలం మారింది. పదేళ్ల తర్వాత కాంగ్రెస్ గెలుపుతో పెద్దపల్లి జిల్లా రాజకీయాలు కూడా ఒక్కసారిగా మారిపోయాయి.అసెంబ్లీ ఎన్నికల ముందు వరకు కయ్యానికి సై అంటూ కత్తులు దూసుకున్న ఇద్దరు నేతలు ఇప్పుడు ఒక్కసారిగా సైలెంట్ అయ్యారు. పదేళ్ల పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న మనోహర్ రెడ్డి ఒక్కసారిగా దూకుడు తగ్గించారు. పార్టీ కార్యక్రమాలకు కూడా దూరంగా ఉంటున్నారట. ఏదైనా పార్టీ ప్రోగ్రామ్స్ ఉంటే అంటీముట్టనటుగా వ్యవహరిస్తున్నారంట. అంతేకాదు క్యాడర్ కు సైతం అందుబాటులో ఉండడంలేదట. రాజకీయంగా మునుపటిలా దూకుడును ప్రదర్శించడంలేదట.

నిత్యం ఏదో ఒక ఆరోపణ

ప్రత్యర్థులపై చేసే విమర్శల్లో వాడీవేడి లేకుండా చప్పగా సాగుతున్నాయంట ఆయన ప్రెస్ మీట్లు. కనీసం పార్టీ కార్యక్రమాల్లో అయినా యాక్టీవ్ గా ఉంటున్నారంటే అదికూడా లేదట. ఒక్క ఓటమితో మనోహర్ రెడ్డి తీరులో ఇంతలా మార్పు వచ్చిందేంటి అంటూ పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా పదేళ్ల పాటు రాజ్యమేలిన మనోహర్ రెడ్డి.. ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే పైన గానీ, కాంగ్రెస్ ప్రభుత్వంపైగాని పల్లెత్తు మాట కూడా అనకుండా ఎందుకు సైలెన్స్ గా ఉంటున్నారనేదే ఇప్పుడు ఎవరికీ అంతుచిక్కడంలేదట.మాజీ ఎమ్మెల్యే సైలెన్స్ పైనే పార్టీ నేతలు తలా ఒకరకంగా చర్చించుకుంటున్నారట. 2023కు ముందు బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న మనోహర్ రెడ్డిపై.. చింతపల్లి విజయ రమణారావు నిత్యం ఏదో ఒక ఇష్యుపై ఆరోపణలు చేస్తుండేవారు.. భూ ఆక్రమణలు, అక్రమ దందాలపై బహిరంగంగానే విమర్శలు చేశారు. అయితే ఎన్నికల తరువాత ఇప్పుడు ఒక్కసారిగా సీన్ మారి పోయింది. పెద్దపల్లి ఎమ్మెల్యేగా చింతపల్లి విజయ రమణా రావు పెద్దపల్లి గెలవడంతోమాజీ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మౌన ముద్రలోకి వెళ్లారు. అందుకు కారణం కూడా లేకపోలేదు అంటున్నాయి కాంగ్రెస్ వర్గాలు.ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత కూడా మనోహర్ రెడ్డి భూ ఆక్రమణల భాగోతం బయట పెడతానంటూ ఎమ్మెల్యే విజయ రమణా రావు హెచ్చరించారు. బంధంపల్లి చెరువుతో పాటు, మనోహర్ రెడ్డికి సంబంధించిన స్కూళ్లు, హాస్టళ్ల లెక్కలు తీస్తానంటూ బహిరంగంగానే ప్రకటించారు. దీంతో అధికార పార్టీ ఎమ్మెల్యే పై విమర్శలు చేస్తే..తనకే నష్టం జరుగుతుందని భావించి మాజీ ఎమ్మెల్యే సైలెన్స్ అయ్యారనే గుసగుసలు జిల్లా రాజకీయవర్గాల్లో విన్పిస్తున్నాయి.తాను ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత మనోహర్ రెడ్డి భూ ఆక్రమాణ లు బయట పెడతా.. విద్యా సంస్థలను కొలిపిస్తానంటూ హాట్ కామెంట్స్ చేసిన ఎమ్మెల్యే విజయ రమణరావు కూడా ఒక్కసారిగా సైలెన్స్ అయ్యారంట. మాజీ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డిపై ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే మౌనంపై వహించడం వెనుక ఏం జరిగి ఉంటుందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతిపక్ష నాయకుడి నుండి అధికారం చేపట్టే వరకు విజయ రమణ హెచ్చరికలకే పరిమితమవడం వెనుకున్న మతలబు ఏంటనే సందేహాలు జిల్లా రాజకీయ నేతల్లో వ్యక్తమవుతున్నాయంట.ఇద్దరి మధ్య రాజీ ఏమైనా కుదిరిందా అంటూ రకరకాల పొలిటికల్ గాసిప్స్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయంట. మరి భూ ఆక్రమణదారుల భరతం పడతానంటూ ఎమ్మెల్యే చేసిన శపథం.. మాజీ ఎమ్మెల్యే సైలెన్స్‌గా ఉండేంత స్థాయికి వెళ్లడం వెనుక ఏదో మతలబు జరిగే ఉంటుందంటూ పెద్దపల్లి రాజకీయ వర్గాలు సెటైర్లు వేసుకుంటున్నారట.

# విచారణకు ఆదేశించిన ప్రభుత్వం

అమరావతి, శ్రీ సత్యసాయి జిల్లాలోని రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి సమీపంలో మాజీ ముఖ్యమంత్రి, వైస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్ మోహన్ రెడ్డి ప్రయాణించిన హెలికాప్టర్ విండో షీల్డ్ కు ఎయిర్ క్రాక్ ఘటనపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ సంఘటనపై మరిన్నీ వివరాలు తెలియజేయాలని పైలెట్, కోపైలెట్ కు నోటీసులు ఇచ్చినట్లు సమాచారం. దీనికి సంబంధించి 16న విచారణకు హాజరు కావాలని చెప్పినట్లు తెలుస్తుంది. రెండు రోజుల క్రితం నోటీసులు ఇచ్చినట్లు సమాచారం. అయితే, రామగిరిలోని పాపిరెడ్డిపల్లిలో టీడీపీ నేతల దాడుల్లో మరణించిన వైసీపీ కార్యకర్త లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించడానికి బెంగళూరు నుంచి ప్రత్యేక హెలీకాప్టర్ లో వైఎస్ జగన్ రామగిరి వెళ్లారు. లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించిన తర్వాత తిరుగు ప్రయాణంలో జగన్ హెలికాప్టర్ లో సాంకేతిక సమస్య ఏర్పడింది. దీంతో రోడ్డు మార్గంలో వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ కారులో తిరిగి వెళ్లి పోయారు.

# మొదలైందా పదవుల జాతర?

అమరావతి,టీడీపీలో పదవుల జాతర మొదలైందా? బంపర్ మెజార్టీతో అధికారంలోకి కూటమి సర్కారులో పదవుల కోసం తెలుగు తమ్ముళ్లు ఎదురుచూస్తున్నారా? మాకొక పోస్ట్ ప్లీజ్ అంటూ అధినేత చుట్టూ చక్కర్లు కొడుతున్నారా? అంటే అవుననే సమాధానం పసుపు దండులో విన్పిస్తోంది. మే నెలాఖరులోగా సంస్థాగత ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని పార్టీ అధినేత ఆదేశించడంతో పసుపు దళంలో పదవుల కోలాహలం మొదలైంది.ఏపీలో తిరుగులేని మెజార్టీతో గెలిచిన కూటమి సర్కారులో పదవుల జాతర మొదలైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతేడాది సెప్టెంబరులో నామినేటెడ్ పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టారు. 20 కార్పొరేషన్ల చైర్మన్లతోపాటు మొత్తం 99 మందితో తొలి జాబితాను అప్పట్లో విడుదల చేశారు. రెండో విడత భర్తీ ప్రక్రియ నవంబరులో జరిగింది. 59 మందితో రెండో జాబితా విడుదలైంది. తొలి, రెండో విడతల్లో సుమారు 150 మంది నేతలకు పదవులను కట్టబెట్టారు చంద్రబాబు.ఇక మూడో విడత జాబితాలో 47 మార్కెట్ కమిటీలకు ఛైర్మన్లను నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. తాజా నిర్ణయంతో.. 705 పదవులు భర్తీ చేసినట్లు కూటమి నేతలు వెల్లడించారు. త్వరలోనే మిగిలిన మార్కెట్ కమిటీల ఛైర్మన్లను ప్రకటిస్తామని స్పష్టం చేసారు. టీడీపీ గెలుపు కోసం కష్టపడిన నేతలకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చిన చంద్రబాబు ఇచ్చిన మాటను నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయితే టీడీపీలో పదవుల కోసం పెద్ద సంఖ్యలో ఆశావహులు పోటీపడుతున్నారంట.మాకొక పదవి ప్లీజ్ అంటూ పార్టీ నేత, ఎమ్మెల్యేలు, మంత్రుల చుట్టూ చక్కర్లు కొడుతూ ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారంట. పదవుల కోసం పార్టీ అధిష్టానానికి దాదాపు 60వేల అప్లికేషన్లు వచ్చినట్లు సమాచారం. అటు జనసేన, బీజేపీలు కూడా మరిన్ని పోస్టులు అడుగుతున్నాయంట. దీంతో అందరికీ న్యాయం చేసేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని సమాచారం.

ఎన్నికల షెడ్యూల్ సైతం ప్రకటన

ఒకవైపు నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ విడతలవారీగా సాగుతుండగా మరోవైపు పార్టీలోనూ పదవుల భర్తీ ప్రక్రియను చేపట్టేందుకు టీడీపీ అధిష్టానం సిద్ధమైంది. ఇప్పటికే పార్టీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియను ప్రారంభించింది. క్షేత్రస్థాయిలోని కుటుంబ సాధికార సారథులు మొదలు.. లోక్‌సభ నియోజకవర్గస్థాయి వరకు అన్ని కమిటీలు, అనుబంధ కమిటీల ఎన్నికల ప్రక్రియను వచ్చే నెల మే 15లోగా పూర్తి చేయాలని పార్టీ అధినేత చంద్రబాబు ఆదేశించడంతో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఎన్నికల షెడ్యూల్ సైతం ప్రకటించారు.సంస్థాగత ఎన్నికల్లో మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రాధాన్యమివ్వాలని కీలక సూచనలు కూడా చేశారట. టీడీపీ రికార్డు స్థాయిలో 1.02 కోట్లకుపైగా సభ్యత్వాల నమోదు ప్రక్రియను ఇటీవలే పూర్తి చేసింది. వచ్చే నెల 15లోగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసి, మే 28, 29, 30 తేదీల్లో కడపలో నిర్వహించనున్న మహానాడులోగా రాష్ట్ర కార్యవర్గాన్ని ప్రకటిస్తారు. మహానాడులో పార్టీ జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకుంటారు.తెలుగుదేశం పార్టీకి క్షేత్రస్థాయిలో అత్యంత పటిష్టమైన సంస్థాగత వ్యవస్థ ఉంది. సగటున ప్రతి 60 మంది ఓటర్లకు ఒక మహిళ, ఒక పురుషుడు చొప్పున ఇద్దరు కుటుంబ సాధికార సారథులు ఉన్నారు. రాష్ట్రం మొత్తం మీద 13 లక్షల మంది కుటుంబ సాధికార సారథులు ఉన్నారు. బూత్, గ్రామ, క్లస్టర్, యూనిట్, మండల, పట్టణ, డివిజన్ కమిటీలు, అనుబంధ కమిటీలు, నియోజకవర్గ కమిటీలు, పార్లమెంటు కమిటీలు ఇలా..కొన్ని లక్షల సంస్థాగత పదవులకు టీడీపీ ఎన్నికలు నిర్వహించనుంది.కుటుంబ సాధికార సారథుల కమిటీని ఏప్రిల్ 20లోపు పూర్తిచేయాల్సి ఉంది. బూత్, గ్రామ కమిటీల గడువు ఏప్రిల్ 14 నుంచి 22 వరకు ఉంది. క్లస్టర్, యూనిట్, మండల, పట్టణ, డివిజన్ కమిటీలు, అనుబంధ కమిటీలకు ఏప్రిల్ 23 నుంచి 30 వరకు గడువు ఉంది. శాసనసభ నియోజకవర్గ కమిటీలు, అనుబంధ కమిటీలను మే 1 నుంచి 7లోపు పూర్తి చేయాల్సి ఉండగా..లోక్‌సభ నియోజకవర్గ కమిటీలు, అనుబంధ కమిటీలను మే 8 నుంచి 15 వరకు ఎన్నుకోవాల్సి ఉంది.టీడీపీ గెలుపు కోసం చాలా మంది నేతలు కష్టపడ్డారు. అయితే వారందరికి న్యాయం చేసేందుకు పార్టీ అధినేత చంద్రబాబు ప్రయత్నిన్నారంట. కూటమి సర్దుబాట్లలో భాగంగా సీట్లు కోల్పోయిన సీనియర్ నేతలకు కూడా పదవులను కట్టబెట్టాల్సిన అవసరం ఉందన్న టాక్ విన్పిస్తోంది. పీఠాపురం వర్మ, రంగా, ప్రభాకర్ చౌదరి, గన్ని వీరాంజనేయులు, దారపనేని నరేంద్ర వైసీపీ హయాంలో అక్రమ కేసుల బాధితుడు. వీరితోపాటు ఇటీవల ఎమ్మెల్సీ ఆశించి నిరాశపడినవారు కూడా కీలకమైన నామినేటెడ్ పోస్టులు అడుగుతున్నారు. మరి అలాంటి నేతలకు న్యాయం చేయాల్సిన అవసరం ఉందన్న వాదన సైతం పార్టీ వర్గాల్లో విన్పిస్తోంది.

# విశాఖలో వైసిపికి మరో షాక్

విశాఖపట్నం, విశాఖపట్నంలో తాజాగా వైసీపీకి గట్టి ఎదురు దెబ్బ తగిలింది. మేయర్‌కు వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించిన సమయంలో వైసీపీకి చెందిన ఇద్దరు కార్పొరేటర్లు.. ఆ పార్టీకి సోమవారం రాజీనామా చేశారు. ఆ పార్టీ సీనియర్ నేత బెహరా భాస్కర్ రావుతోపాటు- 91వ వార్డు కార్పొరేటర్ జోత్స్న, 92వ వార్డు కార్పొరేటర్ బెహరా వెంకట స్వర్ణలత శివ దేవ రాజీనామా చేశారు. అయితే వీరు మరికొద్ది రోజుల్లో జనసేన పార్టీలో చేరనున్నారు. అందుకు ముహూర్తం సైతం ఖరారు అయినట్లు- తెలుస్తోంది. జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ సమక్షంలో వీరు ఆ పార్టీ కండువా కప్పుకోనున్నట్లు- సమాచారం. మరోవైపు విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ రాజకీయ రసవత్తరంగా మారాయి. వైసీపీ నేత, నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారిపై అవిశ్వాస తీర్మానానికి సంబంధించి నోటీ-సు జారీ చేసే నేపథ్యంలో ఇద్దరు వైసీపీకి కార్పొరేటర్లు రాజీనామా చేయడం ఆ పార్టీ నేతలో ఒకింత విస్మయం వ్యక్తమవుతోంది. అదీకాక ఈ అవిశ్వాస తీర్మానంపై ఏప్రిల్ 19వ తేదీన జీవీఎంసీ కౌన్సిల్ ప్రత్యేకంగా సమావేశం కానుంది. ఇంకోవైపు ఇటీ-వల 74వ డివిజన్ కార్పొరేటర్ వంశీ రెడ్డి సైతం వైసీపీని వీడారు.

# టిటిడి గోశాలపై అసత్య ఆరోపణలు

తిరుపతి, వైసీపీ నేత, టిటిడి బోర్డు మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డిపై తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు అధికారులు చర్యలు తీసుకునేందుకు సిద్ధమయ్యారు. ఎస్వీ గోశాలలో గోవులు మృతి చెందాయని అసత్య ప్రచారాలపై భూమనపై ధర్మకర్తల మండలి ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా బోర్డు సభ్యుడు భాను ప్రకాష్ రెడ్డి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజుకు ఫిర్యాదు చేశారు. ఎస్వీ గోశాలలో 100 గోవులు మరణించాయని, పవిత్రమైన గోశాలను గోవధ శాలగా మార్చారంటూ కరుణాకర్ రెడ్డి తప్పుడు ఆరోపణలు చేశారని భాను ప్రకాష్ రెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇలాంటి నిరాధార ఆరోపణలు చేసిన భూమన కరుణాకర్ రెడ్డిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని పోలిసులను లిఖితపూర్వకంగా కోరారు. భక్తుల మనోభావాలు దెబ్బతినేలా భూమన కరుణాకర్ రెడ్డి వ్యవహరించారని భాను ప్రకాష్ రెడ్డి తెలిపారు. ఎస్వీ గోశాలపై అసత్య, అబద్ధపు ప్రచారాన్ని చేశారు.. కరుణాకర్ రెడ్డి దృష్టికి లోపం ఉంది ఏమో.. ఇష్టం వచ్చినట్లుగా అసత్య ప్రచారం చేస్తున్నారు.. నోరు ఉంది కదాని ఇష్టం వచ్చినట్లు– మాట్లాడారు.. నిరాధార ఆరోపణలు చేసిన భూమనపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేయామని కోరాం.. కరుణాకర్ రెడ్డి చైర్మన్ గా ఉన్నప్పుడు పెద్ద సంఖ్యలో గోవులు చనిపోయాయి.. గతంలో మేము వైసీపీ హాయంలో జరిగిన అక్రమాలపై ఆధారాలతో బయట పెట్టామని తేల్చి చెప్పారు. వైసీపీ హాయంలో పురుగులు పట్టిన ఆహారాన్ని గోవులకు పెట్టారని భాను ప్రకాష్ రెడ్డి ఆరోపించారు. అలాగే టిటిడిలో జరుగుతున్న అక్రమాలపై విజిలెన్స్ విచారణ కొనసాగుతోంది అని భాను ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు వైసీపీ చేసినా అక్రమాల అన్నిటి పైనా చర్యలు తీసుకుంటుందన్నారు. భూమన కరుణాకర్ రెడ్డి ఒక్కడే కాదు.. అందరి అవినీతిని బయటకు తీస్తానని చెప్పుకొచ్చారు. తాను స్థానికుడిని కావడంతో టిటిడి కన్నా తనవద్దే ఎక్కువ సమాచారం ఉంటుంది.. భవిష్యత్తులో టీటీడీపై ఎలాంటి ఆధారాలు లేకుండా అసత్య ప్రచారాలు చేసినా, మాట్లాడినా ఏ స్దాయి వ్యక్తి పైనా అయినా సరే కఠినమైన చర్యలు తీసుకుంటాం.. ఆ దిశగా బోర్డులో నిర్ణయం తీసుకుంటామని భాను ప్రకాష్ రెడ్డి వెల్లడించారు.

## అమెరికాలో రోడ్డు ప్రమాదం

గుంటూరు,అమెరికా టెక్సాస్‌లోని డెంటన్ నగరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తెలుగు విద్యార్థినిలు తీవ్రంగా గాయపడగా, వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన గత శనివారం తెల్లవారుజామున జరిగింది. ఎన్.బోనీ బ్రే స్ట్రీట్ డబ్ల్యు. యూనివర్శిటీ డ్రైవ్ సమీపంలో ఈ ప్రమాదం జరిగినట్టు తెలుస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాకు చెందిన దీప్తి వంగవోలు, ఆమె స్నేహితురాలు కలిసి గత శనివారం తెల్లవారుజామున కాలినడకన ఇంటికి చేరుకోబోతుండగా, వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం వారిద్దరినీ ఢీకొట్టింది. వెంటనే ఆ వాహనం డ్రైవర్ అక్కడి నుంచి పారిపోయాడు. దీప్తి తలకు లోతైన గాయం అయిందని, ఆమెకు శస్త్ర చికిత్స జరుగుతోందని స్థానిక మీడియా తెలిపింది. మరో విద్యార్థిని కూడా తీవ్రంగా గాయపడిందని అయితే ఆమెకు ప్రాణాపాయం లేదని అమెరికా మీడియా నివేదికలు తెలిపాయి. డెంటన్ పోలీసులు ఈ హిట్ అండ్ రన్ ఘటనపై దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న డ్రైవర్‌ను, ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించడానికి ప్రజల సహాయం కోరుతూ అధికారులు ప్రకటన విడుదల చేశారు.

# దూకుడు అందుకేనా?

హైదరాబాద్,తెలంగాణ కాంగ్రెస్ పాలిటిక్స్‌లో ఆయనది పెద్దన్న పాత్ర. రాజకీయాలకు రిటర్మెంట్ ప్రకటించానని పైకి చెబుతున్నా.. కీలకమైన విషయాల్లో మాత్రం తనదైన పాత్రే పోషిస్తున్నారు. ఇప్పుడు మంత్రివర్గ విస్తరణ అంశం అంతా ఆయన చుట్టూనే తిరుగుతోంది. ఇన్నాళ్లు కాంగ్రెస్ భీష్మపితామహుడిగా.. పేరొందిన సదరు నేతను ధృతరాష్ట్రుడితో పోల్చుతూ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి హాట్ కామెంట్స్ చేశారు.మరోవైపు రంగారెడ్డి జిల్లాకు చెందిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాత్రం ఆ పెద్దాయనను ధర్మరాజుతో పోల్చుతున్నాడంట. ఇంతకీ టీ–కాంగ్రెస్‌లో ఎవరా పెద్ద మనిషి..? ఆయన పోషిస్తున్న పాత్ర ఏంటి..? సీఎం చుట్టూ తిరగాల్సిన మంత్రివర్గ విస్తరణ అంశం ఆయన చుట్టే ఎందుకు తిరుగుతోంది..? వాచ్ దిస్ స్టోరీ.తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రివర్గ విస్తరణ అంశం రాష్ట్ర రాజకీయాల్లో పెద్ద దుమారాన్నే రేపుతోంది. క్యాబినెట్ బెర్తు దక్కించుకునేందుకు ఎవరికి వారు తమదైనశైలిలో రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పుడు ఈ వ్యవహారం అంతా కాంగ్రెస్ పెద్దలు.. భీష్మపితామహుడిగా చెప్పుకునే జానారెడ్డి చుట్టే తిరుగుతోందట. ఆయన మాత్రం ఇప్పటికే రాజకీయాలకు గుడ్‌బై చెప్పానని చెప్పినప్పటికి ప్రస్తుతం ఆయనను కాంగ్రెస్ హైకమాండ్.. సలహాదారుగా నియమించిందింది.

సడెన్‌గా జానారెడ్డి ఎంట్రీ

ప్రభుత్వానికి కీలకమైన అంశాల్లో జోక్యం చేసుకుంటున్నారు జానారెడ్డి. ఇదిలా ఉంటే ఆయన ఇద్దరు కుమారులలో ఒకరు జైవీర్ రెడ్డి ఎమ్మెల్యేగా, మరొకరు రఘువీర్‌రెడ్డి ఎంపీగా ఉన్నారు. తాజాగా ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో తన శిష్యుడు శంకర్ నాయక్‌కు ఎమ్మెల్సీ ఇప్పించుకోగలిగారు. ఇక ఇప్పుడు మంత్రివర్గ విస్తరణ విషయంలో కూడా జోక్యం చేసుకుంటుండటంతో ఆయన చుట్టూనే రాజకీయం రసవత్తరంగా సాగుతోందనే చర్చ పొలిటికల్ సర్కిల్స్ లో జరుగుతోంది.రాష్ట్ర మంత్రివర్గంలో ప్రస్తుతం ఆరు బెర్తులు ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీ చేసేందుకు ఈ మధ్య కాంగ్రెస్ అధిష్టానం ఫోకస్ పెట్టి.. టీ కాంగ్రెస్ ముఖ్యనేతలతో సంప్రదింపులు చేసింది. మంత్రివర్గ విస్తరణకు అంతా రెడీ అనుకున్న సందర్భంలో ఆల్ ఆఫ్ సడెన్‌గా జానారెడ్డి ఎంట్రీ ఇచ్చారు. రంగారెడ్డి జిల్లాకు మంత్రి పదవి ఇవ్వాలంటూ పార్టీ అధిష్టానానికి లేఖ రాశారు. దీంతో పాటు ఇతరత్రా అంశాల కారణంగా మంత్రివర్గ విస్తరణకు బ్రేక్ పడింది. ఏప్రిల్ 3న క్యాబినెట్ విస్తరణ చేయాల్సి ఉండగా.. అది కాస్త ఏఐసీసీ సమావేశాల తర్వాత రెండో వారంలో ఉంటుందని అంతా భావించారు.కానీ ఇప్పుడు మంత్రివర్గ విస్తరణ కాస్త నిరవధికంగా వాయిదా పడింది. దీంతో మంత్రిపదవిపై గంపెడాశలు పెట్టుకున్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి లోలోన రగిలిపోతున్నారట. ఇన్నాళ్లు వేచి చూసే ధోరణి అవలంభించిన రాజగోపాల్ రెడ్డి .. ఇక మాటలు లేవ్.. మాట్లాడుకోవడాలు లేవ్ అంటూ ఫైర్ అయ్యారు. మంత్రివర్గ విస్తరణ బ్రేక్ పడటానికి ప్రధాన కారణం జానారెడ్డినే అంటూ బహిరంగసభ వేదికపై విరుచుకుపడ్డారు.పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్కొక్క నియోజకవర్గానికి ఒక్కొక్క మంత్రి ఇంచార్జ్‌గా పనిచేస్తే.. భువనగిరికి మాత్రం ఒక ఎమ్మెల్యేగా తాను ఇంచార్జ్‌గా ఉంటూ గెలిపించానంటూ స్వరం పెంచారు. అంతేకాదు జానారెడ్డిని టార్గెట్ చేస్తూ..ధర్మరాజులా ధర్మంలా వ్యవహరించాల్సిన వ్యక్తి..ధృతరాష్ట్రుడిలా వ్యవహరిస్తున్నారంటూ హాట్ కామెంట్స్ చేశారు. 30 ఏళ్లు మంత్రిపదవి అనుభవించిన జానారెడ్డికి..ఈ రోజు రంగారెడ్డి జిల్లా గుర్తుకువచ్చిందా అంటూ ధ్వజమెత్తడం పొలిటికల్ సర్కిల్స్‌లో చర్చనీయాంశంగా మారింది.

జానారెడ్డిని ధర్మరాజుతో పోల్చుతున్న రంగారెడ్డి జిల్లా నేత

కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీరు ఇలా ఉంటే.. రంగారెడ్డి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలేమో జానారెడ్డిని ధర్మరాజుతో పోల్చుతున్నారంట.

# పాతాళానికి దీదీ ప్రతిష్ఠ...

పశ్చిమ బెంగాల్‌లో 25,753 మంది ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది నియామకాలను రద్దు చేస్తూ కోల్ కతా హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సమర్థిస్తూ భారత సుప్రీం కోర్టు 2025 ఏప్రిల్‌లో ఇచ్చిన రూలింగ్ రాష్ట్రంలో రాజకీయంగా, సామాజికంగా తీవ్రమైన గందరగోళానికి దారితీసింది. 2016లో పశ్చిమ బెంగాల్ స్కూల్ సర్వీస్ కమిషన్ ఈ నియామకాలు జరిపింది. ఈ ప్రక్రియలో తీవ్రంగా అవకతవకలు జరగడంతో ఈ తీర్పు వచ్చింది. నియామకాల ప్రక్రియ పూర్తిగా మోసపూరితంగా ఉందని కోర్టు నిర్ధారణకు వచ్చింది. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంపై అశనిపాతం సుప్రీం కోర్టు తీర్పు ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వానికి పెద్ద ఎదురుదెబ్బ. ప్రభుత్వం అవినీతి ఆరోపణల్లో కూరుకుపోయిందనితేల్చిచెప్పినట్లయింది. ప్రస్తుతం నిర్బంధంలో ఉన్న మాజీ విద్యాశాఖ మంత్రి పార్థ చటర్జీ, టిఎంసిలో ఉన్నత స్థాయి నాయకుల ప్రమేయంతో ఈ కుంభకోణం జరగడం రాజకీయంగా తీవ్రనష్టం చేకూర్చింది. ముఖ్యంగా ప్రతిపక్ష భారతీయ జనతా పార్టీ, సిపిఎం వంటి పార్టీలు ఈ తీర్పును తమకు అనుకూలంగా ఉపయోగించుకుని, టిఎంసి పూర్తిగా అవినీతిమయం అని ఆరోపిస్తున్నాయి. దీంతో భవిష్యత్‌లో ఎన్నికలకు ముందే మమత పార్టీ ప్రతిష్ఠ మరింత దిగజారే అవకాశం ఉంది. సుప్రీం కోర్టు తీర్పుతో ప్రతిపక్షాలకు బ్రహ్మాస్త్రం దొరికినట్లయింది. అమిత్ మాల్వియ, సంబిత్ పాత్ర వంటి నాయకులు దీనిని నగదు కొట్టు –జాబ్ పట్టు అన్న కుంభకోణంగా చిత్రీకరించడమే కాక, టిఎంసి అధికార దుర్వినియోగానికి నిదర్శనంగా చూపుతున్నారు. బెంగాల్‌లో విద్యాబోధన గొప్ప గౌరవంగా భావిస్తారు. పట్టణ, సెమీ అర్బన్ ప్రాంతాలలో ప్రతిపక్షాల ప్రచారం ప్రభుత్వానికి దెబ్బే. ఇటీవల కాలంలో రాష్ట్రంలో సిపిఎం ప్రభావం క్షీణించింది, అయినా ఆ పార్టీ టిఎంసి విద్యా వ్యవస్థను నిర్వహిస్తున్న తీరును తూర్పారబడుతోంది. పారదర్శకత లోపించిందని ఆరోపిస్తోంది. బెంగాల్‌లోని గ్రామీణ ప్రాంతాలలో టిఎంసి బలమైనదే. అయినా ప్రతిపక్షాల విస్తృత ప్రచారం వల్ల ప్రభుత్వపాలనపై వ్యతిరేకత పెరగవచ్చు.

మమతా బెనర్జీ స్పందన

సిఎం మమతా బెనర్జీ తీర్పును బహిరంగంగా తిరస్కరించినా, దానిని అమలు చేస్తామని హామీ ఇవ్వడం తీర్పును రాజకీయంగా ప్రేరేపించబడినదిగా చిత్రీకరించడం ఆమె వ్యూహాన్ని సూచిస్తోంది. బిజెపి, సిపిఎంలను ఆమె దుమ్మెత్తిపోస్తూ బెంగాల్‌లో విద్యా వ్యవస్థను అణగదొక్కడానికి కుట్ర జరుగుతోందని ఆరోపిస్తూ, ఆ పార్టీల నిందలను తిప్పికొట్ట లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. అయితే, ఆమె వ్యాఖ్యలు– న్యాయవ్యవస్థ నిష్పాక్షికతను ప్రశ్నించడం వల్ల న్యాయ వ్యవస్థలో ఉద్రిక్తతలు పెరిగే ప్రమాదం –మున్ముందు ఆమె పాలనపై మరింత స్క్రూటినీ జరిగే అవకాశం ఉంది. టిఎంసి సర్కార్‌కు సవాళ్లే మూడు నెలలలోపు కొత్త నియామక ప్రక్రియ చేపట్టాలని కోర్టు ఇచ్చిన ఆదేశం రాష్ట్ర ప్రభుత్వానికి పెను సవాల్‌గా నిలుస్తోంది. కొత్త ప్రక్రియలో పారదర్శకతను నిర్ధారించడం, మరింత పకడ్బందీగా నిర్వహించడంతోపాటు ప్రజల్లో విశ్వాసాన్ని పునరుద్ధరించుకోవడం చాలా కీలకం. మళ్లీ ఏదైనా తప్పు జరిగితే సంక్షోభం మరింత జటిలమవుతుంది. ఈ తీర్పు ఒక్క రోజులో వేలాది మందిని నిరుద్యోగులుగా మార్చేసింది. నిరుద్యోగ సమస్యను పరిష్కరించవలసిందిగా టిఎంసిపై రాష్ట్ర వ్యాప్తంగా ఒత్తిడి పెరగవచ్చు. అలాగే ఇది తిరిగి ప్రజాదరణ పొందేందుకు పలు ప్రజాకర్షణ చర్యలకు దారి తీసే అవకాశం ఉంది. ఒక్కసారిగా 25 వేల మందికి పైగా ఉద్యోగుల తొలగింపు బాధిత టీచర్లు, బోధనేతర సిబ్బందికి తీవ్ర మనస్తాపాన్ని మిగిల్చింది. వీరిలో న్యాయబద్ధంగా నియమింపబడినవారు ఎందరో. ప్రతాప్ రాయ్ చౌదరి, తంపి ఆలం వంటి వారు తమ వ్యాసాలలో ఉపాధి కోల్పోయిన వారి ఆర్థిక, భావోద్వేగాలు, ఎదుర్కొనే నష్టాలు, ఇఎంఐలు, కుటుంబాలపై ఆధారపడిన వారి అనిశ్చిత భవిష్యత్‌ను వివరించారు. సామూహిక తొలగింపు ప్రజల్లో నిరాశా నిస్పృహలు కలిగించే ప్రమాదం ఉంది. వీరిలో సమస్యపై ప్రభుత్వం దృష్టి పెట్టని పక్షంలో నిరసనలకు, సామాజిక అశాంతికి దారితీసే అవకాశం ఉంది.

మహిళలలో అశాంతి చిచ్చు

పశ్చిమ బెంగాల్‌లో మహిళలు విద్యాబోధన పట్ల మక్కువ చూపుతారు. ఈ వృత్తికే వారి ప్రథమ ప్రాధాన్యం. మహిళా సాధికారతకు, ముఖ్యంగా సామాజికంగా గౌరవం కలిగించే వృత్తిగా భావిస్తారు. ఈ తీర్పు మహిళా టీచర్లలో తీవ్రమైన అశాంతిని రగిల్చింది. ఉద్యోగం కోల్పోవడంతో పాటు, సామాజికంగా



కళంకాన్ని తెచ్చిపెట్టింది. చాలా మంది వివాహ అవకాశాలను దెబ్బతీసింది. సామాజికంగా ఉపాధ్యయ వృత్తిలో ఉన్నవారిని వధువులుగా ఇష్టపడతారు. అలాగే ఒంటరి తల్లులు, ఒంటరిగా తమ కాళ్లమీద తాము నిలబడి జీవనోపాధిని పొందుతున్నవారు ఇక్కట్ల పాలయ్యారు. ఈ తీర్పు లింగ ఆధారిత అసమానతలను పెంచుతోంది. ఈ కుంభకోణం తర్వాత కోర్టు తీర్పుతో ప్రభుత్వ నియామక ప్రక్రియలపై ప్రజల్లో అనుమానాలు మరింత పెరిగాయి. విద్యా వ్యవస్థకు వన్నెతెచ్చిన రజత్ హల్దార్ వంటి సీనియర్ ఉపాధ్యాయులు వ్యవస్థలో లోపాలను ఎత్తిచూపుతూ, దోషులతో పాటు, నిజాయితీపరులైన అభ్యర్థులను కూడా ఎందుకు శిక్షకు గురిచేస్తున్నారని ప్రశ్నించారు. ఈ తీర్పు వల్ల న్యాయ వ్యవస్థపై కూడా అపనమ్మకం పెరగవచ్చు.ఏక మొత్తంగా 25 వేల మంది ఉద్యోగాల రద్దు చాలా అన్యాయంగా భావిస్తున్న వారు ఎందరో. అక్రమాలకు పాల్పడిన వారు, నిజాయితీగా తగిన అర్హతలు కలిగి న్యాయంగా ఉద్యోగం పొందిన వారి మధ్య తేడాను గుర్తించడంలో విఫలమయ్యారని వారు భావిస్తున్నారు.కుంటుపడనున్న విద్యా బోధన గ్రామీణ పాఠశాలల్లో ఏళ్ల తరబడి టీచర్ల కొరత వల్ల విద్యా బోధన అంతంత మాత్రంగా సాగుతోంది. వేలాది మంది ఉపాధ్యాయులను వెంటనే తొలగించడం వల్ల, విద్యా బోధనకు తీవ్ర విఘాతం కలిగే ప్రమాదం ఉంది. పేదరికం అధికంగా ఉన్న చాలా జిల్లాల్లో పాఠశాల స్థాయిలోనే చదువు మానివేసేవారు అధికం. 2023లో ఓ నివేదిక ప్రకారం హయ్యర్ సెకండరీ స్థాయిలో విద్యార్థులు ఊహించిన దాని కంటే 56 వేల మంది తక్కువగా ఉన్నారని తేలింది. తీర్పుతో ఉపాధి కోల్పోయిన టీచర్ల స్థానంలో కొత్తవారిని వెంటనే భర్తీ చేయకపోతే ఇంకా సమస్య తీవ్రమవుతుంది. విద్యా సంవత్సరం మధ్యలో తీర్పు వెలువడడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెను సవాళ్లను ఎదుర్కొంటున్నారు. ఇది ప్రజలలో అసంతృప్తిని రేకెత్తించింది.

తీర్పుపై భిన్నాభిప్రాయాలుతీర్పుపై సమాజంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తీర్పు సమాజంలో చీలిక తెచ్చిందని చెప్పవచ్చు. కొందరు ఈ తీర్పును అవినీతికి వ్యతిరేకంగా వచ్చిన మహత్తరమైనదిగా భావిస్తూ, చాలా మంది కష్టపడి పనిచేసే విద్యావేత్తలకు జరిగిన అన్యాయంగా చూస్తున్నారు. కోల్‌కతాలోని షాహిద్ మినార్ సమావేశాలు ఉపాధి కోల్పోయిన టీచర్లలో పెరిగిన నిరాశ నిస్పృహలకు అద్దంపట్టాయి. తీర్పు వల్ల నష్టపోయిన వారికి మద్దతుగా నిలుస్తామని మమతా బెనర్జీ భీషణ ప్రతిజ్ఞ చేయడం అమె మద్దతుదారులను ఉత్తేజపరుస్తోంది. కానీ, జవాబుదారీతనం కోరుకుంటున్నవారిని దూరం చేస్తోంది. సామాజిక విభజనను మరింత తీవ్రతరం చేస్తోంది. ఈ కేసు పశ్చిమ బెంగాల్ పాలనలో వ్యవస్థాగత లోపాలను ఎత్తుచూపింది. రాష్ట్రంలో ఉద్యోగాల కొరత, ప్రభుత్వ ఉపాధిపై మోజు, డిమాండ్ నియామక కుంభకోణాల ప్రమాదాన్ని పెంచుతోంది.కోర్టు నిర్ణయం న్యాయానికి పెద్ద పీట వేసే లక్ష్యంతో చేసినప్పటికీ, అక్రమార్కులను లక్ష్యంగా చేసుకోవడం, మూకుమ్మడిగా నియామకాలను రద్దు చేయడం న్యాయ వ్యవస్థ విస్తృత దృక్పథంపై పలు ప్రశ్నలు లేవనెత్తుతోంది. కార్యనిర్వాహక వ్యవస్థ ఓవర్ యాక్షన్‌కు చెక్ పెట్టడంలో న్యాయవ్యవస్థ పాత్ర చాలా కీలకమైనది. కానీ సామాజికంగా ఎదురయ్యే పరిణామాలను గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.క్లిష్ట పరిస్థితి ఎదుర్కొంటున్న టిఎంసి రాజకీయంగా టిఎంసి క్లిష్ట పరిస్థితి ఎదుర్కొంటోంది. ఒక పక్క తమ ఓటు బ్యాంక్‌ను కాపాడుకుంటూ కోర్టు తీర్పును అమలుచేయడం అశిధారా వ్రతమే. న్యాయ వ్యవస్థ విషయంలో మమత ప్రదర్శించిన ఘర్షణాత్మక వాక్చాతుర్యం ఆమె మద్దతుదారులకు ఉత్తేజం కలిగించవచ్చు. కానీ, పాలనాపరమైన వైఫల్యాలు కొనసాగుతే పార్టీకి కీలకంగా ఉన్న మితవాదులను దూరం చేసే ప్రమాదం ఉంది.

# 'ఉపాధి'కి ఉరి



న్యూఢిల్లీ,గామాల్లో పేదలకు ఏడాదిలో కనీసం వంద రోజులు పని కల్పించే ఉద్దేశంతో యుపిఎ–1 హయాంలో తీసుకొచ్చింది. మహాత్మా గాంధీ గ్రామీణ జాతీయ ఉపాధి హామీ చట్టం (ఎం.ఎన్.ఆర్.ఇ.జి.ఎ–నరెగా). అటువంటి బృహత్తర చట్టం అమలులో లెక్కకు మించిన లోపాలను ఎత్తిచూపింది పార్లమెంటరీ స్థాయి సంఘం. చట్టం హామీ ఇచ్చిన ప్రయోజనాలు కార్మికులకు దక్కడం లేదని గుర్తించింది. నరెగాపై సమగ్ర సమీక్ష కోసం జాతీయ స్థాయిలో స్వతంత్రతతో కూడిన పారదర్శక సర్వే నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. కార్మికుల సంతృప్తి, వేతనాల్లో జాప్యం, భాగస్వామ్యం పోకడలు, ఆర్థిక అవకతవకల దృష్టి కోణంలో సర్వే చేయాలని సూచించింది. చట్టం అమల్లో ఎదురవుతున్న సవాళ్లనూ పరిశీలించాలంది. కార్మికుల పనిదినాలు వంద నుంచి 150 రోజులకు, దినసరి వేతనం 400 రూపాయలకు పెంచాలని తెలిపింది. కాంగ్రెస్ ఎంపి సప్తగిరి శంకర్ ఉల్కా నేతృత్వంలో గ్రామీణాభివృద్ధిపై పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ మోడీ పదేళ్ల జమానాలో ఉపాధి హామీపై మచ్చుకు పరిశీలించి ఇచ్చిన రిపోర్టు ఇది. నరెగాను మోడీ ప్రభుత్వం ఒక క్రమ పద్ధతిలో నిర్వీర్యం చేస్తోందని నివేదికతో స్పష్టమైంది. ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడిచే బిజెపి కుయుక్తులపై ఇంతకాలం వెల్లడవుతున్న ఆందోళనలను ఆ రిపోర్టు నిర్ధారించింది.ఆది నుంచీ నరెగాపై మోడీ ప్రభుత్వానిది మొసలి కన్నీరేనని దాని చేష్టలే తెలుపుతాయి. బడ్జెట్ కేటాయింపుల నుంచి అమలు వరకు ప్రతిదీ చట్టాన్ని దెబ్బతీసేదిగానే ఉన్నాయి. బడ్జెట్ ప్రతిపాదనలనే తీసుకుంటే దశాబ్ద కాలంలో ఏనాడూ డిమాండ్‌కనుగుణంగా లేవు. ఏవో కొన్ని నిధులను చూపించడం, వాటితోనే కాలక్షేపం చేయడం, చివరాఖరులో ఎంతో కొంత విదిలించడం పరిపాటిగా మారింది. కరోనా సమయంలో మాత్రమే ఖర్చు రూ.లక్ష కోట్లు దాటింది. పట్టణాలకు వలసలు వెళ్లిన లక్షలాది కార్మికులు తమ ఊళ్లకు వెనక్కి వచ్చిన సందర్భంలోని ఆ ఖర్చు సైతం నాటి డిమాండ్‌తో పోల్చితే చాలా చాలా తక్కువ. అదేంటంటే, బడ్జెట్‌లో నిధులు చూపించాల్సిన అవసరం లేదని, డిమాండ్ పెరిగితే ఆటోమేటిగ్గా నిధులు పెంచుతామన్న మోడీ సర్కారు మాట ఒట్టి బూటకం. సకాలంలో నిధులివ్వని కారణంగా పనులు నిలిచిపోయిన ఉదంతాలెన్నో. రాష్ట్రాలకు నిధుల విడుదలలో కేంద్రం తీవ్ర జాప్యం చేస్తోందని పార్లమెంట్ సాక్షిగా నిరూపణ అయింది. 2025 మార్చి చివరినాటికి కేంద్రం రాష్ట్రాలకు అక్షరాలా 26 వేల కోట్ల రూపాయలు బకాయి పడింది. వాటిలో కూలీల వేతనాలు రూ.15 వేల కోట్లు. 2024–25లో ఉపాధి హామీకి ప్రతిపాదించింది రూ.86 వేల కోట్లు కాగా అంత పెద్ద మొత్తంలో నెలల పర్యంతం నిధులివ్వకుండా జాప్యం చేసి పేదలను ఉద్ధరిస్తామనడం వంచన కాదా?ఉపాధి హామీ ప్రధాన లక్ష్యం గ్రామీణ పేదలకు ఉపాధి కల్పన. ఆ లక్ష్యాన్ని మోడీ సర్కారు క్రమంగా పక్కదారి పట్టించే ఎన్నో చర్యలు చేపట్టింది. బిజెపి, ఎన్‌డిఎ పాలిత రాష్ట్రాలు వాటిని పుణికిపుచ్చుకుంటున్నాయి. వ్యవసాయానికి అనుసంధానం పాట పాడుతున్నాయి. ఖర్చు లేని ప్రకృతి వ్యవసాయానికి, సేంద్రీయ వ్యవసాయానికి లింక్ పెడుతున్నాయి. నరెగా పనుల్లో భారీ యంత్రాల వినియోగం చట్ట విరుద్ధం. అపరిమితమైన మెటీరియల్ కాంపొనెంట్ సైతం చట్ట విరుద్ధం. అవన్నీ యధేచ్ఛగా సాగిపోతున్నాయి. పని లేని రోజుల్లో పని కల్పన కోసం గ్రామాల్లో జాబ్ కార్డుల జారీ సక్రమంగా లేదు. జాబ్ కార్డు పొందిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలన్న నిబంధన అమలు కావట్లేదు. వేతనాల జాప్యానికి పరిహారం విషయంలోనూ తప్పించుకొనే ఉదంతాలే ఎక్కువ. ఇటీవలి కాలంలో లక్షలాది జాబ్‌కార్డులు రద్దు చేస్తున్నారు. ఆర్థిక అవకతవకలు సరేసరి. ఈ చర్యలన్నీ ఉపాధి హామీ లక్ష్యాన్ని పలచన చేసేవి. ఉపాధి లేని కార్మికులకు అన్యాయం చేసేవి. కార్మికుల్లో వందకు వంద రోజులూ పని దొరికే వారిని, దినసరి వేతనం రూ.300 దొరికే వారిని వేళ్లపై లెక్కించొచ్చు. పట్టణాల్లో, గ్రామాల్లో భారీ యంత్రాల విచ్చలవిడి వినియోగం, ఆర్థిక మాంద్యం, వ్యవసాయ సంక్షోభం వలన పనుల కోసం డిమాండ్ పెరుగుతోంది. కరువొస్తే తీవ్రత ఇంకా ఎక్కువ. అందుకే ఏడాదిలో 200 రోజుల పని, దినసరి కూలి 600 కావాలన్న డిమాండ్ బలంగా ముందుకొస్తోంది. అర్బన్‌లోనూ ఉపాధి హామీ కావాలన్న ఆకాంక్ష వెల్లడవుతోంది. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ నివేదికతోనైనా మోడీ ప్రభుత్వానికి కనువిప్పు కావాలి. గతంలో వేసిన అమర్‌జిత్ సిన్హా కమిటీ నివేదికకు మల్లే చెత్తబుట్ట దాఖలు చేస్తే ప్రజలు క్షమించరు.

# రైతులకు గుదిబండగా అప్పులు

జగిత్యాల,వ్యవసాయం కోసం రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. ప్రధానంగా పంటపెట్టుబడుల కోసం నేటికీ వడ్డీ వ్యాపారస్థుల దగ్గర అప్పు తీసుకుని అవస్థలు పడుతున్నారు. తీసుకున్న అప్పులకు వడ్డీలు తడిసి మోపెడవుతుంది. ఈ సమస్యలను అధిగమించి రైతుకు అండగా ఉండాల్సిన ప్రభుత్వాలు రుణామాఫీ ప్రకటించి మొక్కుబడి తీర్చుకుంటున్నారు. దీంతో సమస్య తాత్కాలిక ఉపశమనం కలిగిస్తోంది తప్ప సమస్యను శాశ్వతంగా దూరం చేయడం లేదు. ఇదే సమయంలో అప్పుల ఊబినుంచి బయటపడడానికి ఆత్మహత్యలను వీరు ఆశ్రయిస్తున్నారు. దీంతో ఆయా రైతుల కుటుంబాలు మరింతగా ఊబిలో చిక్కుకుని పోతున్నాయి. తెలంగాణలో పరిస్థితిని మార్చేలా తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నారు. రైతులకు పెట్టబడతో పాటు రాయితీ విత్తనాలు,ఎరువులు అందుతున్నాయి. అలాగే బీమా సౌకర్యం రాబోతున్నది. ఇకపోతే 24 గంటల ఉచిత కరెంట్ అందుతోంది. సేంద్రియ వ్యవసాయానికి ప్రోత్సాహకాలు పెంచాలి. అంతేగాకుండా బలవంతంగా సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి. ఇవన్నీ జాతీయస్థాయిలో జరగాలి. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలుకూడా తెలంగాణ తరహాలో చొరవ తీసుకోవాలి. అప్పుడే మార్పు కనిపిస్తుంది. రైతులకు భరోఎసా దక్కి వ్యవసాయం ముందుకు సాగుతుంది. తెలంగాణలో రైతుబంధు సాయం అందడంతో ఇప్పుడు వీరిలో కొంత భరోసా పెరగింది. రైతు ఏ కారణంతో చనిపోయినా ఆ కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడకుండా బీమా పరిహారంలో రూ.5 లక్షలు అందజేస్తారు. గ్రామాల్లోని రైతు సమన్వయ సమితుల సభ్యులు అధికారులకు సహకారం అందిస్తున్నారు. గ్రామాల్లోని రైతులు అధికారులకు పట్టాదారు పాసుపుస్తకాల్లోని వివరాలు, ఆధార్‌కార్డు, నామినీ, ఇతర విషయాలను చెబుతున్నారు.

# కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలి

నిజామాబాద్, రైతులు దళారులను నమ్మి మోస పోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్ద వరి ధాన్యం విక్రయించి పూర్తి మద్దతు ధర పొందాలని మార్కెటింగ్ అధికారులు సూచించారు. తూకాల్లో మోసం జరుగకుండా డిజిటల్ మీటర్లు ఏర్పాటు చేశాం. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే తమ ధాన్యం విక్రయించాలన్నారు. ప్రభుత్వం వరి పంటకు మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకుంటోంది. ధాన్యం డబ్బును బ్యాంకు ఖాతాలో వేయడంతో పాటు తూకాల్లో ఎలాంటి మోసాలు జరుగకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దీనిని అన్నదాతలు అర్థం చేసుకుని ఐకేపీ ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలి. ప్రతీ మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల పంటను తరలించేందుకు అయ్యే ఖర్చును తగ్గిచ్చేందుకు కృషి చేస్తోంది. రైతులు దళారుల చేతిలో మోసపోకుండా అధికారులు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. డిజిటల్ తూకం మిషన్, మద్దతు ధరతో పాటు సకాలంలో రైతులకు డబ్బులు అందిస్తున్నారు.ధాన్యం కొనుగోలు చేసేందుకు అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ధాన్యం కొనుగోలు అమ్మకునేందుకు దళారులను ఆశ్రయించడంతో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. దీనిని గమనించిన అధికారులు, ప్రజా ప్రతినిధులు కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతులు వరి ధాన్యాన్ని పెద్ద ఎత్తున ఐకేపీ కొనుగోలు కేంద్రాలకు చేరుస్తున్నారు. రైతుల వద్ద నుంచి పట్టాదారు పాస్ పుస్తకం, బ్యాంకు పాస్ బుక్, ఆధార్ నంబర్లను సేకరించి తేమ 17 శాతం వరకు ఉంటేనే మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నారు. రైతుల అకౌంట్లలో నాలుగైదు రోజుల్లో నగదు చేరేలా చర్యలు చేపడుతున్నారు.

# చిత్తూరులో పరువు హత్య

చిత్తూరు,చిత్తూరు నగరంలో దారుణం జరిగింది. మతాంతర వివాహం చేసుకున్న ఓ యువతి పుట్టింట్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందడంతో పరువు హత్యగా పోలీసులు భావిస్తున్నారు. తన భార్యను పుట్టింటి వారికి అప్పగించి.. తిరిగి వచ్చిన మరుసటి రోజే చనిపోయిందని, ఇది పరువు హత్యగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ దిశగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చిత్తూరు పట్టణానికి చెందిన యాస్మిన్ భాను అనే యువతి.. చిత్తూరు జిల్లాలోని పూతలపట్టుకు చెందిన సాయితేజను ప్రేమించింది. ఈ విషయం తెలుసుకున్న ఇరు కుటుంబాలు వారి వివాహానికి ఒప్పుకోలేదు. దీంతో గత ఫిబ్రవరిలో ఇద్దరూ ఇంట్లో నుంచి వెళ్ళిపోయి నెల్లూరులో ప్రేమ వివాహం చేసుకొని అక్కడే నివాసం ఉంటున్నారు. కాగా ఇటీవల యువతి తండ్రికి సీరియస్‌గా ఉందని కుటుంబ సభ్యులు ఆమెకు ఫోన్ చేయడంతో యాస్మిన్ కన్నవారింటికి వచ్చింది. అయితే మారుసటి రోజు యాస్మిన్ అనుమానాస్పదరీతిలో మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు విచారణ చేపట్టగా.. ప్రేమ వివాహం చేసుకొని పరువు తీసావని తండ్రి తిట్టడంతో, మనస్తాపం చెంది రాత్రి తన గదిలో ఉరి వేసుకుందని ఆమె తల్లి పోలీసులకు తెలిపింది. దీంతో పోలీసులు ఆ గదిలో పరిశీలించారు. ఉరి వేసుకున్న ఆనవాళ్ళు ఏమీ లేకపోవడంతో అనుమానించి యాస్మిన్ తల్లిని, సోదరిని అదుపులోకి తీసుకున్నారు. తండ్రితో పాటు పలువురు బంధువులు పరారీలో ఉన్నారు. వారి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు చెప్పారు. ఈ కేసును పరువు హత్య కోణంలో దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. అయితే విషయం తెలుసుకున్న భర్త.. తన భార్యను కన్నవారే చంపేసి, మార్చురీలో శవాన్ని చూపించారంటూ తీవ్రంగా విలపించాడు. ఈ ఘటన ఆదివారం జరిగింది.పోలీసుల కథనం ప్రకారం.. చిత్తూరు స్థానిక బాలాజీ నగర్‌కు చెందిన యాస్మిన్‌బాను (26) ఎంబీఏ పూర్తి చేసిందని, బీటెక్ చదివిన సాయితేజ్‌తో కాలేజీ రోజుల్లోనే ఏర్పడిన పరిచయం ప్రేమకు దారితీసిందని, ఈ క్రమంలో వారిద్దరూ వివాహానికి సిద్ధమయ్యారన్నారు. అయితే సాయితేజ ఎస్సీ వర్గానికి చెందిన వాడు కావడంతో ముస్లిం అయిన యాస్మిన్ తల్లిదండ్రులు షౌకత్ అలీ, ముంతాజ్ అంగీకరించలేదన్నారు. దీంతో వారు ఈ ఏడాది ఫిబ్రవరి 9న నెల్లూరులో వివాహం చేసుకున్నారు. అయితే తమ తల్లిదండ్రుల నుంచి ప్రాణహాని ఉందని, తమకు రక్షణ కల్పించాలని అదే నెల 13న తిరుపతి డీఎస్పీని కలిసి కోరారన్నారు. దీంతో పోలీసులు ఇరు కుటుంబాలను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించినట్లు చెప్పారు. కొద్ది రోజుల తర్వాత యాస్మిన్ కుటుంబ సభ్యులు ఫోన్‌లో కుమార్తెతో మాట్లాడటం మొదలుపెట్టారు. తండ్రి షౌకత్ అలీకి ఆరోగ్యం బాగాలేదని, ఒకసారి వచ్చి చూసి వెళ్లాలని యాస్మిన్‌ను పదేపదే కోరడంతో ఆదివారం ఉదయం సాయితేజ తన భార్యను తీసుకువచ్చి యాస్మిన్ కన్నవారింట్లో దించి వెళ్లిపోయాడు. ఆ తర్వాత కాసేపటికే సాయితేజ తన భార్యకు ఫోన్ చేస్తే కలవలేదు. దీంతో అనుమానం వచ్చి నేరుగా వారింటికి వెళ్లగా.. యాస్మిన్ ఇంట్లో లేదని, ఆత్మహత్య చేసుకోవడంతో ప్రభుత్వాసుపత్రి మార్చురీలో ఉందని సమాధానం చెప్పడంతో.. ఆసుపత్రికి వెళ్లి భార్య మృత దేహాన్ని చూసి బోరున విలపించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# స్వరాష్ట్రంలో పని చేయని పీకే వ్యూహాలు!



హైదరాబాద్,ప్రశాంత్ కిషోర్, పీకే.. పేరు చాలు. పరిచయం అవసరం లేదు.పీకే అంటే చాలు, ఆయన ఎవరో, ఆయన ఏమిటో అందరికీ అర్థమైపోతుంది. ఎన్నికల వ్యూహకర్తగా ఆయనకు అంత మంచి గుర్తింపు వుంది. అయితే అది ఆయన గతం. ప్రస్తుతం ఆయన, వేషం మార్చారు. రాజకీయ అరంగేట్రం చేశారు. సో.. ఇప్పుడు పీకే పొలిటీషియన్, రాజకీయ నాయకుడు. జన సురాజ్ పార్టీ (జేఎస్పీ) వ్యవస్థాపక అధ్యక్షుడు. ఈ సంవత్సరం చివర్లో జరిగే బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్య భూమికను పోషించేందుకు తహతహ లాడుతున్న రాజకీయ నాయకుడు. ఈ ఎనికల్లో ఎలాగైనా కింగ్, కాదంటే కనీసం కింగ్ మేకర్ కావాలని కలలుకంటున్నారు.అవును గతంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మొదలు, ఏపీ మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి వరకు, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మొదలు ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ వరకు ఎందరో నాయకులకు, ఎన్నో పార్టీలకు ఎన్నికల వ్యూహకర్తగా పని చేసిన ప్రశాంత్ కిషోర్ ఇప్పుడు స్వయంగా ఎన్నికల బరిలో దిగుతున్నారు. వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు.అయితే అదేదో సామెత చెప్పినట్లు అందరికీ వర్కౌట్ ఆయన వ్యూహలు, సొంతానికి వచ్చేసరికి అతంగా పనిచేస్తున్నట్లు లేదని అంటున్నారు. ఔను పెరటి చెట్టు వైద్యానికి పనికి రాదు.. సొంత వైద్యం వంటబట్టదు అని పెద్దలు ఊరికే అన్నారా? ఇప్పుడు తాను స్వయంగా రాజకీయవేత్తగా మారిన పీకేకు ఆయన వ్యూహాలు ఆయన సోంత పార్టీకి ఏ మాత్రం ఉపయోగపడటం లేదు.. ఫలించడం లేదు. నిజానికి నాలుగేళ్ళ కిందట (2021)పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీకి పని చేసిన పీకే ఇక పై ఏ రాజకీయ పార్టీకి వ్యూహకర్తగా పని చేయనని ప్రక టించారు. అలాగే క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చేది లేదనీ అన్నారు. అంతే కాదు, నేను రాజకీయాలకు పనికిరాను అని తనకు తానే సెల్ఫ్ సర్టిఫికేట్ ఇచ్చుకున్నారు. అయితే, ఆ తర్వాత కొద్ది కాలానికే ఆ ఒట్టు తీసి గట్టున పె ట్టారు. కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు, బీజేపీ వ్యతిరేక పార్టీలను ఏకం చేసేందుకు ప్రయత్నాలు సాగించారు. కాలికి బలపం కట్టుకుని దేశం అంతా తిరిగారు. శరద్ పవార్ మొదలు కేసీఆర్ వరకు ప్రముఖ నేతలు అందరినీ కలిశారు. అందరినీ కలిపారు. మరోవంక కాంగ్రెస్ పునర్జీవనానికి ఉడతా భక్తిగా ఉచిత సలహాలు కూడా ఇచ్చా రు. చివరకు తాతకు దగ్గులు నేర్పినట్లు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ( సిడబ్ల్యుసి) సభ్యులను కూర్చోపెట్టి పాఠాలు చెప్పారు. ఇలా దేశ రాజకీయాల్లో తన కంటూ ఒక స్థానం సంపాదిం చుకునేందుకు చాలా ప్రయత్నాలు చేశారు. సరే ఆ ప్రయత్నాలు ఏవీ అంతగా పని చేయలేదు. మధ్యలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అప్పటి అధికార పార్టీలతో డీల్ కుదుర్చుకున్నారు. అయితే అక్కడా కథ అడ్డం తిరిగింది. ఉభయ రాష్ట్రా ల్లో ఆయన వ్యూహాలు ఉడక లేదు.ఏపీలో వైసీపీ, తెలంగాణలో బీఆర్ఎస్ బం డ్లు బోల్తా కొట్టాయి. అక్కడ ఏపీలో జగన్ రెడ్డి, ఇక్కడ తెలంగాణలో కేసీఆర్ ఇద్దరి కిద్దరు చిత్తుగా ఓడి పోయారు. జగన్ రెడ్డి పరిస్థితి అయితే మరీ ఘోరం, పదకొండు పరుగులకే ఔటై పోయారు. ఇక చివరి ప్రయత్నంగా స్వరాష్ట్రం బీహార్ లో సొంత జెండా ఎగరేశారు. జన సురాజ్ పార్టీని స్థాపించారు. సం వత్సరం పైగా రాష్ట్రంలో పాద యాత్ర చేస్తున్నారు. అయితే అదేమిటో కానీ, శకునం చెప్పే బల్లి కుడితిలో పడింది అన్నట్లుగా.. యూపీ, బెంగాల్, ఢిల్లీ, ఏపీ ఇలా ఎక్కడెక్కడో, ఎవరెవరినో గెలిపించిన ప్రశాంత్ కిషోర్ వ్యూహం స్వరాష్ట్రంలో, పని చేస్తున్నట్లు లేదని అంటున్నారు. ఇటీవల బీహార్ లో నాలుగు అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో జేఎస్పీ తొలిసారిగా ఎన్నికల బరిలో దిగింది.అయితే నలుగు స్థానాలకు ఒంటరిగా పోటీ చేసిన జేఎస్పీకి ఒక్క సీటు దక్కలేదు. కానీ జేఎస్పీ ఖాతాలో పది శాతం ఓట్లు అయితే పడ్డాయి.అ లా జేఎస్పీ చీల్చిన ఓట్లు ప్రతిపక్ష కూటమిని దెబ్బతీశాయి. మూడు సిట్టింగ్ స్థానాలతో పాటుగా మొత్తం నాలుగు స్థానాలలో ఆర్జేడీ సారధ్యంలోని మహా ఘటబంధన్ ఓడిపోయింది. రెండు నియోజక వర్గాల్లో అయితే అధికార ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు వచ్చిన మె జారిటీ కంటే జేఎస్పీకి వచ్చిన ఓట్లు ఎక్కువని లెక్క తేలింది. దీంతో పీకే అసలు రంగు బయట పడిందని బీహార్ ప్రజలు పీకే పార్టీని, బీజేపీ బీ టీమ్ గా భావిస్తున్నారని విశ్లేషకులు అంటున్నారు.ఈ నేపథ్యంలో ఇండియా టుడే నిర్వహించిన తాజా సర్వేలో జేఎస్పీ ఓటు షేర్ ఏకంగా పది నుంచి మూడు శాతానికి పడిపోయిది. దీంతో కింగ్ ఆర్ కింగ్ మేకర్ కావాలనే పీకే కల కలగానే మిగిలిపోతుందని అంటున్నారు. అలాగే ఇటీవల పాట్నాలో జేఎస్పీని ర్వహించిన తొలి భారీ బహిరంగ సభకు లక్షల్లో జనం వస్తారని భావించి ఏ ర్పాట్లు చేస్తే వేలల్లో కూడా జనం రాలేదు. అందుకే పీకే పట్టుమని పది నిముషాలు అయినా మాట్లాడకుండానే తట్టా బుట్టా సర్దేశారు. సో .. బీహార్ ఎన్నికల్లో పీకే పాత్ర ఏమిటన్నది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారిందని అంటున్నారు. అలాగే, ఉప ఎన్నికల్లో పోటీ చేయడం వ్యూహకర్త చేసిన వ్యూహాత్మక తప్పిదంగా భావిస్తున్నారు

# పెరుగుతున్న విద్యుత్ వినియోగం

అమరావతి,ఎపిలో ఇటీవల విద్యుత్ కోతల కారణంగా ఉత్పత్తి కూడా తగ్గడంతో సరఫరాలో తీవ్రిబ్బందులు తప్పడం లేదు. నానాటికీ పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా సదరన్ డిస్కం పరిధిలోని జిల్లాల్లో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోంది. గతేడాది మార్చితో పోల్చుకుంటే ఈ ఏడాది మార్చిలో యూనిట్లు అధికంగా వినియోగించారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచే ఉష్ణోగ్రతలు పెరుగుతూ వచ్చాయి. మార్చిలో గణనీయంగగా పెరిగిన ఎండలతో ఇనియోగం ఆ మేరకు పెరిగింది. దీంతో ప్రజలు ఫ్యాన్లు, ఏసీలు, కూలర్ల వినియోగం పెంచారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టే పనిలో ఉన్నారు. కోతలతో పాటు వినియోగం తగగ్గించాలని సూచిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ విద్యుత్ వినియోగం పెరిగినందున గ్రామీణ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచకపోతే సరఫరాలో ఆటంకాలు ఏర్పడే ప్రమాదం ఉందని అధికారులు అంటున్నారు. గతంలో ఎన్నడూ ఇంతగా వినియోగంలేదని విద్యుత్‌శాఖ గణాంకాలు తెలుపుతున్నాయి. పెరుగుతున్న విద్యుత్ వినియోగానికి అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం రాష్ట్రంలో విద్యుదుత్పత్తి, సరఫరా బాగానే ఉన్నా, ట్రాన్స్‌ఫార్మర్ల సంఖ్యను తగినంతగా పెంచుకోకుంటే అవి తరచూ పేలిపోయే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు తీవ్ర వేడి కొనసాగడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. మధ్యాహ్న సమయంలో ఇంటి నుంచి బయటకు రావడానికే భయపడుతున్నారు. కోస్తా, రాయలసీమల్లో పలు చోట్ల 40 డిగ్రీలకు చేరువవుతోంది. మరో రెండుమూడు రోజులు ఎండ తీవ్రత పెరగనుందని వాతావరణ శాఖ తెలిపింది. ఇప్పుడే ఇలా ఉంటే ఇక మే నెలలో ఎలా ఉంటుందోనని ప్రజలు భయపడుతున్నారు. మధ్యాహ్నం 12



నుంచి 3 గంటల వరకూ రోడ్లపై జనసంచారం కనిపించట్లేదు. భూగర్భజలాలు అడుగంటడం, భూతాపం పెరిగిపోవడంతో మంచినీటిసమస్య కూడా అధికం అవుతున్నది. బోర్లువేసి నీటిసమస్య కొంత తగ్గించాలని భావించినా ఎంత లోతుకు తవ్వినా నీళ్లు రాని పరిస్థితులు దాపురించాయి. వేసవి తాపంనుంచి ఉపశమనం పొందేందుకు ప్రభుత్వాలపరంగా ప్రత్యామ్నాయ ప్రణాళికలు లేవు. రాష్ట్రంలోని జలాశయాల్లో కూడా నీటివనరులు వేసవి తాపానికి ఆవిరి అవుతున్నాయి. మండుతున్న ఎండలు అటు శారీరక అస్వస్థతలు పెంచడంతో పాటు ప్రజల దాహార్తిని కూడా పెంచుతున్నాయి. ఉష్ణోగ్రతకు పక్షులు, పశువులు అసువులు బాస్తున్నాయి. ఉదయం పదిగంటలు దాటినప్పటినుంచీ రహదారులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఉష్ణోగ్రత ప్రభావం, వడగాడ్పులు తీవ్రతరం కావడంతో రాష్ట్రంలో రేడియేషన్ ప్రభావం కూడా పెరుగుతున్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# పవన్ భార్యపై ట్రోల్స్.. విజయశాంతి ఏమన్నారంటే?



హైదరాబాద్,ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ భార్య అన్నా లెజినోవా, వారి కుమారుడు మార్క్ శంకర్‌లపై జరుగుతున్న సోషల్ మీడియా ట్రోలింగ్‌పై కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి తీవ్రంగా స్పందించారు. విదేశాల నుంచి వచ్చి, మరో మతానికి చెందినప్పటికీ అన్నా లెజినోవా హిందూ ధర్మాన్ని విశ్వసించడాన్ని ఆమె కొనియాడారు. అంతేకాకుండా, అన్నా లెజినోవా తన కుమారుడు అగ్నిప్రమాదం నుంచి క్షేమంగా బయటపడినందుకు కృతజ్ఞతగా తిరుమలలో శ్రీవారికి తలనీలాలు సమర్పించారని, అన్నదాన ట్రస్ట్‌కు విరాళం ఇచ్చారని విజయశాంతి గుర్తు చేశారు. ఇలాంటి మహిళను ట్రోల్ చేయడం తప్పు అని ఆమె మండిపడ్డారు. పవన్ కళ్యాణ్ కుటుంబ జోలికి వస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని విజయశాంతి హెచ్చరించారు.ఈ మేరకు విజయశాంతి తన అభిప్రాయాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. "దేశం కాని దేశం నుంచి వచ్చి, పుట్టుకతో వేరే మతం అయినప్పటికీ హిందూ ధర్మాన్ని విశ్వసించిన మహిళ. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ గారి సతీమణి అన్నా లెజినోవాగారిపై కొందరు కామెంట్ చేస్తూ ట్రోల్ చేయడం అత్యంత అసమంజసం. అనూహ్యంగా జరిగిన దురదృష్టకర అగ్ని ప్రమాదం నుంచి వారి కుమారుడు బయటపడినందుకు, ఆ విశ్వాసాన్ని నిలబెట్టిన నిలువెత్తు దైవం మన శ్రీ వెంకటేశునికి కృతజ్ఞతగా తిరుమలలో శ్రీవారిని దర్శించుకుని తలనీలాలిచ్చి, అన్నదానం ట్రస్ట్‌కి విరాళం సమర్పించి సేవ కూడా చేశారు. సంప్రదాయాన్ని గౌరవించిన అన్నా లెజినోవా గారిని కూడా ట్రోల్ చేసేవారిని తప్పు అని చెప్పక తప్పడం లేదు" అని ఆమె అన్నారు.

"హరహర మహాదేవ్. జై తెలంగాణ" అంటూ ఆమె తన పోస్ట్‌ను ముగించారు.కాగా, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిన్న కుమారుడు మార్క్ శంకర్‌కు ఇటీవల సింగపూర్‌లో అగ్ని ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. ఆ తర్వాత వారు హైదరాబాద్ తిరిగి వచ్చారు. ఈ క్రమంలో కొందరు వ్యక్తులు సోషల్ మీడియాలో పవన్ కళ్యాణ్, ఆయన భార్య అన్నా లెజినోవా, కుమారుడు మార్క్ శంకర్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీనిపై వెంటనే స్పందించిన పోలీసులు ముగ్గురు యువకులపై కేసు నమోదు చేశారు. వారిని కర్నూలు జిల్లా గూడూరులో అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. గుంటూరు సైబర్ క్రైం పోలీసులు ఈ కేసును దర్యాప్తు చేస్తున్నారు. పవన్ కళ్యాణ్ కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు పుష్పరాజ్, ఉదయ్ కిరణ్, ఫయాజ్‌లను పోలీసులు గుర్తించారు. వీరు ముగ్గురు అల్లు అర్జున్ అభిమానులుగా తెలుస్తోంది.మొత్తానికి, పవన్ కళ్యాణ్ కుటుంబంపై జరుగుతున్న ట్రోలింగ్‌ను విజయశాంతి తీవ్రంగా ఖండించడంతో ఈ విషయం మరోసారి చర్చనీయాంశంగా మారింది. పోలీసులు నిందితులపై చర్యలు తీసుకుంటుండగా, సోషల్ మీడియాలో ఇలాంటి అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

# ఆయన.. కేసీఆర్‌ను ఇరుకునబెట్టాడా? రేవంత్‌ను సమర్థిస్తున్నాడా?

హైదరాబాద్,దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతున్న తీరును గమనిస్తే కాంగ్రెస్ పార్టీకి చేరువయ్యే సూచనలు కనిపిస్తున్నాయన్న చర్చలు వినిపిస్తున్నాయి. తాజాగా ఆయన తొగుట మండల బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్ రావును ఇరుకునబెట్టేలా, రేవంత్ రెడ్డి సర్కార్‌ను నిలబెట్టేలా మాట్లాడారని కొందరు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.తొగుట మండల కేంద్రంలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కొత్త ప్రభాకర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి పాలనతో విసుగుచెందిన రియల్టర్లు, బిల్డర్లు, పారిశ్రామికవేత్తలు కచ్చితంగా ప్రభుత్వాన్ని పడగొట్టాలని అంటున్నారని బాంబు పేల్చారు. కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైతే ఎమ్మెల్యేలను కొనుగోలు చేయాలని, ఆ ఖర్చునంతా తామే భరిస్తామంటున్నారని అన్నారు. ఇలా వ్యాఖ్యానించిన వెంటనే పిల్లల నుంచి పెద్దల వరకు కాంగ్రెస్ పాలనపై విసుగు చెందారని, గ్రాఫ్ అమాంతం పడిపోయిందని, బీఆర్ఎస్ దరిదాపుల్లో లేదని మాట్లాడటంతో కార్యకర్తలు సైతం కంగుతిన్నారు. అసలు ఆయన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కాపాడేందుకు మాట్లాడుతున్నారా, బీఆర్ఎస్‌ను పరోక్షంగా బదనాం చేస్తున్నారా? అనేది తెలియక తలలు పట్టుకున్నారు. ఏది ఏమైనా కొత్త నర్మగర్భ విమర్శలు అటు బీఆర్ఎస్ శ్రేణుల్లో, ఇటు కాంగ్రెస్ కార్యకర్తల్లో చర్చనీయాంశమయ్యాయి.

గతంలో రేవంత్‌ను కీర్తించిన ప్రభాకర్

దుబ్బాక నియోజకవర్గం అభివృద్ధి కోసం ఏ ముఖ్యమంత్రీ ఇవ్వని నిధులను రేవంత్ రెడ్డి ఇచ్చారని గతంలో కొత్త ప్రభాకర్ రెడ్డి.. ముఖ్యమంత్రిని అమాంతం పైకెత్తి కీర్తించారు. ఈ నెల మొదటి వారంలో నిధుల మంజూరుపై స్పందిస్తూ..




నియోజకవర్గానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం కన్నా ఎక్కువ నిధులు ఇచ్చారని కితాబునిచ్చారు. దీంతో అప్పట్లో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరతారా? అనే చర్చ జరిగింది. ఈ వ్యాఖ్యలతో పార్టీ పెద్ద కేసీఆర్ కంగుతిన్నారు. ఇలా మాట్లాడ్డమేంటని సన్నిహితుల వద్ద కేసీఆర్ ఆరా తీశారు తప్పితే పిలిపించి మందలించే సాహసం చేయలేకపోయారని గుసగుసలాడుకుంటున్నారు. రెండు వారాల వ్యవధిలోనే మరోసారి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అప్రమత్తం అయ్యేలా మాట్లాడడంపై కేసీఆర్ ఏ వైఖరి అవలంబిస్తారో వేచి చూడాలి. వాస్తవానికి కొత్త ప్రభాకర్ రెడ్డి మాజీ మంత్రి టీ హరీశ్‌రావుకు సన్నిహితుడనే ముద్ర ఉంది. ఇద్దరి మధ్య విడదీయలేని విధంగా సత్సంబంధాలు ఉన్నాయనేది జగమెరిగిన సత్యం. రాజకీయంగానే కాకుండా వ్యాపారపరంగా ఇద్దరూ భాగస్వాములు కూడా. వ్యాపార పరంగా ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకే ప్రభాకర్ రెడ్డి నర్మగర్భంగా విమర్శలు చేస్తున్నారని, పార్టీ మారే ఆలోచన లేదని బీఆర్ఎస్ నాయకులు దిద్దుబాటుకు దిగారు.

# పర్యావరణ విధ్వంసం పట్టని ప్రజలు



న్యూఢిల్లీ,పర్యావరణ విధ్వంసంపై దృష్టి పెట్టకపోవడంతో భానుడు చెలరేగిపోతున్నాడు. ఎండ వేడిమి, వడ గాడ్పులతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉత్తరభారతం అయితే క్రమంగా నిప్పుల కొలిమిలా తయారవుతోంది. గతంలో ఎప్పుడూ లేనంతగా ఈ యేడు చలికాలం వణికిస్తే.. ఎండాకాలం ఉడికిస్తోంది. ఇలాంటి విపరీత వాతావరణ పరిస్థితులకు మనం చేస్తున్న విధ్వంసం కారణమని గుర్తించడం లేదు. పాలకులతో పాటు.. ప్రజలు కూడా ఇందుకు బాధ్యులే. కొన్ని రోజులుగా క్రమంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరుతున్నాయి. గాలిలో తేమ శాతం తగ్గిపోతోంది. మేఘాలు తొలగిపోయి పూర్తిగా పొడి వాతావరణం ఏర్పడడంతో సూర్యుని కిరణాలు నిటారుగా తాకుతుండ టంతో రేడియేషన్ పెరిగి భూమి బాగా వేడెక్కి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. మే వరకు ఇదే పరిస్థితి కొనసాగ నుందని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో పరిశుభ్రత, పారిశుద్ధ్యానికి పెద్దపీట వేయాల్సిఉంది. పర్యావరణ పరిరక్షణ తమ బాధ్యత కాదన్న రీతిలో ఉండడం వల్లనే చెట్లను నరికేస్తున్నా చోద్యం చూశారు. అందుకే ఏటా మొక్కలు నాటుతున్నా..భూగర్భ జలాలు ఇంకేలా చేస్తున్నా.. ఏయేటి కాయేడు దేశంలో ఎండలు మండి పోతున్నాయి. ఇకపోతే ప్రస్తుత పరిస్తితులు చూస్తుంటే ఇదంతా మనకుగా మనం చేసుకున్న పర్యావరణ విధ్వంసానికి ప్రత్యక్ష నిదర్శనంగా చెప్పుకోవాలి. అడవులను నరకడం, కాంక్రీట్ జంగల్‌ను పెంచడం, మొక్కల పెంపకాన్ని విస్మరించడం, భూగర్భ జలాలను తోడేయడం, ఇసుకను తవ్వితీయడం వంటి అనేకానేక చర్యలు ఇందుకు కారణ మయ్యాయి. దీనికితోడు పర్యావరణ విధ్వంసానికి తోడ్పడే ప్లాస్టిక్ విపరీతంగా వినియోగిస్తున్నాం. ప్లాస్టిక్ ఎంతటి విధ్వంసం సృష్టిస్తుందో ఎండలను బట్టి అర్థం చేసుకోవచ్చు. ఏటా విధ్వంసం జరుగుతున్నా దానిని అడ్డుకునే కఠిన చర్యలను అవలంబించడం లేదు. ఎవరికి వారు మాకేంటి లే అన్న ధోరణిలో ఉన్నారు. ఇవే మనలను అనేకానేక రోగాలకు కారణం చేస్తున్నాయి. ప్రధానంగా గతంలో ఎన్నడూ లేని విధంగా మంచినీటి సమస్య కూడా తీవ్రం అయ్యింది. ఇలాగే మనం ముందుకు సాగితే దేశం ఎడారిగా మారుతుందనడంలో సందేహం లేదు. దశాబ్దాలుగా దేశంలో పర్యావరణ హితమైన చర్యలకు పాలకులు కట్టుబడకపోవడం వల్ల పచ్చదనం మాయమయ్యింది. పచ్చదనం అన్నది లేకుండా పల్లెల్లో ఉన్న చెట్లను ఎక్కడిక్కడ నరికి వేశారు. గతంలో ఇంటిముందు ఉండే చెట్లను కూడా డబ్బుకోసం అమ్ముకున్నారు. ఇప్పుడు చాలా గ్రామాల్లో కోతుల బెడద కారణంగా చెట్లను తెగనరికే స్తున్నారు. అందుకే తెలుగు రాష్ట్రాలు ఎండవేడిమికి అతలాకుతలం అవుతు న్నాయి. ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరిగి పోతున్నాయి. మండే ఎండలకు తోడు రెండు రాష్ట్రాల్లోను తాగునీటికి కటకట ప్రారంభం అయింది. మూడునుంచి నాలుగు డిగ్రీలు సాధారణ ఉష్ణోగ్రతలకు అదనంగా నమోదవుతుండటంతో ప్రజలు బేజారెత్తుతున్నారు. ఉదయం నుండే మొదలవుతున్న ఎండవేడిమి సాయంత్రం అయినా ఎక్కడా తగ్గకపోవడం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఏటా ఎండాకాలం బాధలను వానాకాలంటో గుర్తుంచుకోక పోవడం వల్ల మంచినీటి సమస్యలు పునరావృతం అవుతున్నాయి. తాగునీరు కాదుకదా రోజువారీ వాడకానికి సరిపడా నీటికి కూడా కటకట తప్పడం లేదు. ప్రధాన జలాశయాలు అడుగంటి పోవడంతో భూగర్భ జలాలు పాతాళానికి చేరుకున్నాయి. పాలకులు కూడా కఠినంగా చర్యలు తీసుకుని పర్యావరణ విధ్వంసాన్ని ఆపకపోతే రానున్న రోజులు మరింత భయంకరంగా ఉండడం ఖాయమని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు. ఇంతకాలం మనం చేసిన విధ్వంసం కారణంగానే అన్ని ప్రాంతాల్లో సాధారణం కన్నా మించి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కనీసం ఒక్కొక్కరు ఒక్కో మొక్క నాటుతూ పోయినా కొంతయినా ఉపశమనం లభించేది. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోకపోతే వైరస్‌లు ఇకముందు కూడా దాడి చేస్తాయని గుర్తించాలి. ప్రభుత్వాలను తిడుతూ కూర్చునే బదులు మన ఇంటినుంచే పరిశుభ్రత అన్నద అలవాటు కావాలి. మొక్కలను పెంచడం మన బాధ్యత కావాలి.

# రాష్ట్రంలో ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నాం

హైదరాబాద్, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఎంతో నిబద్ధతతో పనిచేస్తోందని, లబ్ధిదారులు ఈ పథకాలను హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఉద్ఘాటించారు. తెలంగాణ కాంగ్రెస్ లెజిస్లేటివ్ పార్టీ (సీఎల్పీ) సమావేశంలో మల్లు భట్టి విక్రమార్క మాట్లాడారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, సామాజిక న్యాయం కోసం చేపట్టిన చరిత్రాత్మక నిర్ణయాల గురించి వివరించారు. 21 వేల కోట్లతో రైతు రుణమాఫీ, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం, యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్స్, 56 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాల నియామకం, 8 వేల కోట్లతో యువతకు అవకాశాలు, సన్న ధాన్యంపై రూ.500 బోనస్, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. ఇవి కేవలం సంఖ్యలు మాత్రమే కాదు, ప్రజల జీవితాల్లో నిజమైన మార్పును తీసుకొస్తున్నాయని అన్నారు. సంక్షేమం ఒక ఎత్తైతే, సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన చరిత్రాత్మక నిర్ణయాలు మరో ఎత్తని ఆయన పేర్కొన్నారు. 'ఎస్సీ వర్గీకరణ, బీసీ కుల గణన వంటి అంశాలను మేము పకడ్బందీగా పూర్తి చేశాం. ఈ రెండు అంశాలు గత దశాబ్దాలుగా ఎందరో గొప్ప నాయకులు సాధించలేనివి. మన ప్రభుత్వం ధైర్యంగా, అందరితో చర్చించి, పారదర్శకంగా ఈ లక్ష్యాలను నెరవేర్చిందని విక్రమార్క గర్వంగా చెప్పారు. ఈ నిర్ణయాలు దేశవ్యాప్తంగా ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తాయని, ఇప్పటికే బీసీ కుల గణన, ఎస్సీ వర్గీకరణ కోసం డిమాండ్ మొదలైందని ఆయన అభిప్రాయపడ్డారు. 'ఎన్నికల ముందు రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లును ఆమోదించాం. ఇది సామాజిక న్యాయం దిశగా కాంగ్రెస్ చేసిన గొప్ప అడుగని ఆయన వివరించారు. కాంగ్రెస్ పార్టీ గతంలో భూసంస్కరణల వంటి సాహసోపేత నిర్ణయాలు తీసుకుందని, అందుకే దేశంలో సుదీర్ఘ కాలం అధికారంలో కొనసాగిందని విక్రమార్క గుర్తు చేశారు. అయితే, బీసీ కుల గణన, ఎస్సీ వర్గీకరణ వంటి నిర్ణయాలు గతంలో పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీలకు రుచించడం లేదని ఆయన విమర్శించారు. ఈ నిర్ణయాలు వారి అస్తిత్వానికే సవాల్ విసురుతాయి. అందుకే బీఆర్ఎస్, బీజేపీ కలిసి కుట్రలు చేస్తూ, ఉన్నది



లేనట్టు-, లేనిది ఉన్నట్టు- చిత్రీకరిస్తున్నాయని ఆయన ఆరోపించారు.కంచ గచ్చిబౌలి వివాదంపై కూడా ఆయన స్పందిస్తూ, కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందనే భయంతో బీజేపీ, బీఆర్ఎస్ కలిసి ఆర్టిఫిషియల్ ఇం-టె-లిజెన్స్‌ను ఉపయోగించి అసత్య ప్రచారం చేస్తున్నాయి. వారు ఏనుగులు, పులులు తిరుగుతున్నాయని చెప్పినా, ప్రజలు సత్యాన్ని గుర్తిస్తారని వ్యాఖ్యానిం చారు.చివరగా, బహుజన వర్గాలను చైతన్యం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. బీసీ కుల సర్వే మీ కోసం, మీ హక్కుల కోసం కాంగ్రెస్ చేసింది. మాతో కలిసి నడవండి, బహుజన శక్తిని చాటి చెప్పండని ఆయన కోరారు.

### ఇసుక అక్రమ రవాణాకు చెక్

కరీంనగర్,ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వారిపై దొంగతనం కేసులు నమోదు చేస్తామని మైనింగ్ అధికారులు స్పష్టం చేశారు. పట్టుబడిన వాహనాల డ్రైవర్లు, యజమానులపై కూడా కేసులు నమోదు చేసి, వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఇసుకను అక్రమంగా నిల్వ చేయొద్దనీ, అలా చేస్తే సంబంధిత భూ యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ఇసుక రవాణా జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎప్పటికప్పుడు దాడులు నిర్వహించి, ఇసుక నిల్వలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com